హైదరాబాద్ వార్త

# 58వేల 290మందికి చేపప్రసాదం పంపిణీ

**-చేపప్రసాదానికి ప్రతియేటా పెరుగుతున్న ఉబ్బసం వ్యాధిగ్రస్తులు**
**-బెల్లంతోపాటు చేప ప్రసాదం లక్షపైగా ప్రసాదం పంపిణీ**



**గోషామహల్,జూన్ 9ప్రభాతవార్త:** చేప ప్రసాదం వేయించుకునే వారి సంఖ్య గత ఏడాది70 వేలమందిపైగా రాగా ఈ సంవత్సరం ఆస్తమా రోగుల సంఖ్య ఏకంగా 58వేల 290 వేలకుపైగా తగ్గింది.మత్స్య శాఖ అధికారులు మధ్యాహ్నం వరకు కొనసాగిన 58వేల 290పై చిలుకు కొరమీనులను విక్రయించినట్లు మత్స్య శాఖ అధికారి వందన తెలిపారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ రంగంలోకి దిగి నాంపల్లి ఎగ్జిబిషన్‌మైదానంలో జరిగే చేపప్రసాదానికి అన్ని విభాగాల అధికారులను ఏర్పాట్లలో సమన్వయం చేశారు.కాగా సుమారుగా 20వేల బెల్లం ద్వారా చేపప్రసాదాన్ని స్వీకరించినట్లు తెలిసింది.గడిచిన ఏడాది కంటే ఈ సంవత్సరం తగినట్లు చెప్పుకోవచ్చును.ఈ ప్రసాదానికి మన రాష్ట్రం కంటే ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే వారే అధికంగా ఉన్నారు. ఏ సంవత్సరంలోఎంత మంది ఆస్తమారోగులు చేపప్రసాదం కోసం వచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పది సంవత్సరాల అస్తమా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగడం చూస్తే ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే వారికి భద్రతతో పాటు నమ్మకం పెరిగిందని చెప్పవచ్చును.. 2006లో 46080,2007లో 38200, .2008లో 41872.2009లో42382,2010లో 38వేల 333,2011లో37171,.2012లో45వేల786,2013లో38వేలపైగా2014లో54వేలపై400 .2015లో55వేలమంది2016లో 65వేల569 మందికి.2017లో 70వేలు 2018లో 78వేలపై 70మందికి 2019,లో 76వేలకుపైగా మందికి 2020,2021,2022 కరోనా మూలంగా చేప మందు ప్రసాదాన్ని నిలిపివేశారు. 14.2023లో సుమారుగా 81వేలపైగా మందికి 15.2025లో 58వేల 290మందికి ఈసందర్భంగా చేప ప్రసాదం పంపిణీకి ఆయా శాఖలు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లుచేసి శభాష్ అనుపించుకున్నారు. కాగా పోలీసులు, బల్దియా,వాటర్‌వర్క్స్ ,ట్రాన్స్‌కో, ఆర్టీసి, మత్స్యశాఖ, ఫైర్‌డిపార్ట్‌మెంట్, రెవెన్యూ శాఖలు అస్తమా వ్యాధిగ్రస్థులు వారిసహాయకు లకు ఎటువంటి అసౌకర్యం కలుగుకుండా తగిన ఏర్పాట్లు చేశారు.మంగళవారం కూడా బత్తిని సోదరులు దూద్‌బౌలి, వనస్థలిపురం, కవాడిగూడలో వారి ఇంటి వద్ద చేపప్రసాదం వేయనున్నట్లు చెప్పారు.

# ఆర్టీసి ప్రయాణికులకు భారీ షాక్..!

**-20 శాతం పెరిగిన బస్‌పాస్ రేట్లు**
**-అమల్లోకి వచ్చిన కొత్త ధరలు**
**-ఆర్డినరీ బస్‌పాస్ రూ.1150ల నుండి రూ.1400లకు**
**-మెట్రో ఎక్స్‌ప్రెస్ రూ.1300ల నుండి 1600లకు పెంపు**



**హైదరాబాద్, జూన్ 9 ప్రభాతవార్త** హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఉన్న సామాన్య, మధ్య తరగతి ఉద్యోగులకు ఆర్టీసీ బిగ్ షాక్ ఇచ్చింది. గ్రీన్ మెట్రో ఏసీ, ఆర్డినరీ బస్ పాస్ రేట్లను పెంచుతూ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. బస్ పాస్ రేట్లను 20 శాతానికి పైగా పెంచుతున్నట్లు సోమవారం ఉదయం టీజీఎస్ ఆర్టీసీ ప్రకటన జారీ చేసింది. తాజాగా పెంచిన రేట్లు ఇలా ఉన్నాయి.. గతంలో ఆర్టీసీ ఆర్డినరీ బస్ పాస్ రూ.1150లు ఉండగా దానిని రూ. 1400లకు పెంచారు. అలాగే మెట్రో ఎక్స్ ప్రెస్ బస్ పాస్ ధర రూ.1300లు ఉండగా దానిని రూ.1600లకు పెంచారు. దీంతో ఉద్యోగులు, రోజువారీ పనులు చేసుకునేందుకు వెళ్లే వారిపై ప్రభావం పడనుంది. ముఖ్యంగా నగరంలో చిన్న, మధ్యతరహా జాబ్స్ చేసే వారు ఎక్కువగా ఈ పాస్ లను తీసుకుంటారు. ఇప్పటికే మెట్రో ఛార్జీలు పెంచగా.. ప్రయాణికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం తో పెంచిన ఛార్జీలను స్వల్పంగా తగ్గించిన విషయం తెలిసిందే. తాజాగా ఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయంపై ఇప్పటికే సోషల్ మీడియాలో వ్యతిరేకత మొదలైంది.ఈ పెంపుతో సామాన్య ప్రజానీకానికి రవాణా ఖర్చులు అధికమవుతాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రోజూ బస్సుల్లో ప్రయాణించేవారు ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతున్నారు.

# రూ.421.66 కోట్లతో కాచిగూడ రైల్వేస్టేషన్ అభివృద్ధి

**-రూ 2.23 కోట్లతో పసాద్ ఇల్యూమినేషన్ లైట్లు ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**





**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త** కాచిగూడ రైల్వేస్టేషన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం 'పసాద్ లైటింగ్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.."కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ. 2.23 కోట్ల వ్యయంతో ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న కాచిగూడ రైల్వేస్టేషన్‌కు ఫసాడ్ ఇల్యూమినేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నిజాం పరిపాలనలో 1916 లో "గోతిక్ శైలి"లో నిర్మాణం జరుపుకున్న కాచిగూడ రైల్వేస్టేషన్‌కు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, రైల్వేస్టేషన్ ఉన్న అద్భుతమైన నిర్మాణ శైలిని మరింత ఆకర్షణీయంగా చూపించడానికి మొత్తం 785 ఇల్యూమినేషన్ లైట్లను ఏర్పాటు చేశారు. ఇకపై ఈ ఇల్యుమినేషన్ లైట్ల వెలుగులో కాచిగూడ రైల్వేస్టేషన్ బిల్డింగ్ ఎంతో చూడముచ్చటగా కనిపించనుంది.నగరం మధ్యలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ రైల్వేస్టేషన్ నుంచి ప్రతి రోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తూ ఉంటారు. ఫసాడ్ లైటింగ్ వ్యవస్థ ద్వారా వీరందరికీ కాచిగూడ రైల్వేస్టేషన్ చారిత్రక ప్రాముఖ్యత తెలియనుంది. కాచిగూడ రైల్వేస్టేషన్ చారిత్రక నేపథ్యం కలిగి ఉండటమే కాకుండా గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకుంటూ పర్యావరణ పరిరక్షణలో కూడా తనవంతు పాత్రను పోషిస్తోంది. గ్రీన్ రైల్వే స్టేషన్లకు రేటింగ్ ఇచ్చే ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్..కాచిగూడ రైల్వేస్టేషన్‌కు ప్లాటినం రేటింగ్ ఇచ్చింది.అంతేకాకుండా, భారతీయ రైల్వేలో ఎనర్జీ ఎఫిషియంట్ స్టేషన్‌గా కాచిగూడ రైల్వే స్టేషన్ నిలిచింది. భారతీయ రైల్వేలో మొట్టమొదటి డిజిటల్ పేమెంట్ సేవలు కూడా కాచిగూడ రైల్వేస్టేషన్ లోనే ప్రారంభమయ్యాయి.

ఇలా ఎన్నో రకాలుగా ప్రాముఖ్యతను సంతరించుకున్న కాచిగూడ రైల్వేస్టేషన్ ను రూ.421.66 కోట్లతో అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి చేస్తున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు, బిజెపి సీనియర్ నేతలు పాల్గొన్నారు.

# ప్రజావాణి విన్నపాలను సత్వరమే పరిష్కరించాలి

**- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్**



ఆర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ఆర్.వి కర్ణన్

**హైదరాబాద్, జూన్ 9,ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను బాధ్యతతో సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయలో సోమవారం జరిగిన ప్రజావాణిలో నగరం నలు వైపుల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. ప్రజలు విన్న వుంచిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంభందిత అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రేటర్ వ్యాప్తంగా తమ సమస్యలను తెలియజేయడాని, విన్నపం అందజేసిన నేపథ్యంలో అధికారులు కూడా వారి విన్నవించిన సమస్యను బాధ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు పరిష్కారంలో సంబంధిత హెచ్ఓడిలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రజలు తమ సమస్యలను ఆన్ లైన్ ద్వారా కూడా విన్నవించవచ్చు...నగర ప్రజలు తమ సమస్యలను ఎపుడైనా జిహెచ్ఎంసి యాప్ ద్వారా విన్నవించ వచ్చని కమిషనర్ ఆర్‌వికర్ణన్ అన్నారు. జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి సందర్భంగా గోపనపల్లి డైమండ్ హేట్స్ కాలానికి సంబంధించిన కొందరు మాకాలనీ రోడ్డు బాగాలేదని కాలనీలో నివాసితులు వాట్సప్ గ్రూప్ లో పోస్టు చేసిన నేపథ్యంలో ఆన్‌లైన్‌లో జిహెచ్ఎంసికి ఫిర్యాదు చేయవద్దని పోస్ట్ చేస్తున్నారని కాలనీకి సంబంధించిన కొందరు వ్యక్తులు కమిషనర్ దృష్టి కి తీసుకొని రాగా నగర ప్రజలు తమ సమస్యలను భౌతికంగానే కాకుండా ఆన్ లైన్ కూడా తము విన్నపాలను తెలియజేయవచ్చని వారికి కమీషనర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణిలో కమిషనర్‌తో పాటుగా అడిషనల్ కమీషనర్ స్నేహ శబరీష్, వేణుగోపాల్, రఘు ప్రసాద్, సి సి పి శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి, నళిని పద్మావతి, పంకజ, గీతా రాధిక, సత్యనారాయణ, సామ్రాట్ అశోక్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, ఉమా ప్రకాశ్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్, అడిషనల్ సిసిపిలు గంగాధర్, వెంకన్న, ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిఈ పనస రెడ్డి, ఎస్ఎన్‌డిపిఎస్ ఈ పి.వి రెడ్డి, ఏ ఈ బాలాజీ, హౌసింగ్ ఈ ఈ రాజేశ్వర రావు, కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

# హుస్సేన్ సాగర్‌లో మాన్‌సూన్ రెగట్టా పోటీలు

**-తొలి రోజు సత్తాచాటిన తెలంగాణ సెయిలర్లు**



పోటీల్లో గెలుపొందిన తెలంగాణ సెయిలర్లు

**హైదరాబాద్,జూన్ 6,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో 16వ ఎడిషన్ మాన్‌సూన్ రెగట్టా సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. మొత్తం ఏడు విభాగాల్లో 127 మంది సెయిలర్లు ఈ పోటీలలో పాల్గొంటున్నారు. తొలి రోజు ఆహ్లాదరకమైన వాతావరణంలో తెలంగాణ సెయిలర్లు సత్తా చాటారు. అండర్-19 మిక్స్‌డ్ డబుల్ క్లాస్‌లో తనుజా కామేశ్వర్-శ్రవణ్‌లు పూర్తి ఆధిపత్యం చెలాయించారు. తొలిమూడు రేసులనూ గెలుచుకుని అగ్రస్థానంలో నిలిచారు. ఇదే విభాగంలో రాష్ట్రానికే చెందిన దీక్షిత కొమ్మరవెల్లి- గణేష్ పీర్కట్ల రెండో స్థానంలో నిలిచారు. సబ్‌జూనియర్ బాలుర విభాగంలో లోకల్ సెయిలర్ రిజ్వాన్ మహమ్మద్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఆకట్టుకున్నాడు. తమిళనాడుకు చెందిన కృష్ణ రెండో స్థానంలో ఉన్నాడు. బాలికల విభాగంలో లాహిరి కొమరవెల్లి తమిళనాడుకు చెందిన శ్రేయ కృష్ణకు గట్టి పోటీ ఇచ్చింది. తొలి రెండు రేసుల్లో చివరి వరకు ఆధిక్యంలో నిలిచినప్పటికీ లాహిరి స్వల్ప తేడాతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. అగ్రస్థానంలో నిలిచిన శ్రేయ ఆసియా, ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో శ్రేయ కృష్ణ ఫేవరెట్‌గా ఉంది. లాహిరి త్వరలో మలేసియాలో జరిగే లాంగ్కావి యూత్ ఇంటర్నేషనల్ పోటీలకు వెళ్లనుంది. ఇక, అండర్19 జూనియర్స్ 29ఇఆర్ స్కిఫ్ క్లాస్‌లో గోవాకు చెందిన నేవీ యూత్ టీమ్ (ఎన్‌వైఎస్‌సీ): ఆటగాళ్లు కార్తీక్ కొర్రోల, హృదయ్ రెండు రేసులు గెలిచి ఆధిపత్యం చెలాయించారు. బాలుర అండర్19 లేజర్ ఫ్లీట్‌లో ఎన్‌వైఎస్‌సీ గోవాకే చెందిన శరణ్య యాదవ్ మూడు రేసులూ గెలిచి అగ్రస్థానంలో నిలిచాడు.

## లాల్ బజార్ మహంకాళి దేవాలయంలో అభరణాలు మాయం

**-పోలీసులకు ఫిర్యాదు చేసిన దేవాదాయశాఖ అధికారులు**

**కంటోన్మెంట్,జూన్ 9 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ లాల్ బజార్ చౌరస్తాలో ప్రసిద్ధిగాంచిన శ్రీ మహంకాలి దేవాలయానికి విరాళ రూపంలో వచ్చిన వెండి, అభరణాలు కొన్ని లేవని భక్తులు దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్లు అండాలు, మధు, ఆలయ ఈఓ సత్య చంద్రారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు మురళీ ముదరిరాజ్, భక్తుల సమక్షంలో బంగారు, వెండి అభరణాలు లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపు లెక్కింపు జరిగింది. 2009 నుంచి ఉండాల్సిన బంగారు, వెండి అభరణాలు కొన్ని కనిపించకపోవడంతో తాత్కాలిక పూజారి రవిశర్మను ప్రశ్నించగా ఆలయ అభరణాలపై సమాధానం సక్రమంగా చెప్పకపోవడం, పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో ఆలయ ఈఓ సత్య చంద్రారెడ్డి తిరుమలగిరి పోలీసులకు పూజారి రవి శస్త్రిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ నాగయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ. ప్రశాంత్ దర్యాప్తు చేస్తున్నారు.

## ఐసిఎఆర్‌లో అభివృద్ధి పనులకు కేంద్రమంత్రి శంకుస్థాపన



**అత్తాపూర్ జూన్9,ప్రభాతవార్త :** ఐసిఎఆర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.శనివారం రాజేంద్ర నగర్‌లోని ఐసిఎఆర్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మినిస్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్,ఫార్మర్స్ వెల్ఫేర్ రూరల్ డెవలమెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హాజరై పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఐసిఎఆర్ సమస్యల పరిష్కరానికి,అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని అన్నారు.ఆరోగ్యానికి చిరుదాన్యాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.చిరుధాన్యాల అభివృద్ధి శాస్త్రవేత్తలు మరింత కృషి చేయాలని రానున్న రోజుల్లో చిరుదాన్యాలకు అధిక ప్రాధాన్యత ఏర్పడుతుందని అన్నారు. అనంతరం ఐసిఎఆర్‌లో కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్ ,ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి,జిల్లా బిజెపి అధ్యక్షుడు రాజభూపాల్ గౌడ్ ర్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిల కలిసి మొక్కలు నాటారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుక్క నర సింహా రెడ్డి , బిజెపి నేతులు మల్లారెడ్డి, వై శ్రీధర్ కొమురయ్య , అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, డివిజన్ ప్రెసిడెంట్ పాండు యాదవ్, బొక్కబాల్ రెడ్డి, విజయ్ మన్మోహన్ రెడ్డి, జగన్, నాగేష్ వినయ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తార్నాక డెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో డిప్యూటీ మేయర్ ఆకస్మిక తనిఖీలు



తార్నాక దక్కన్ హోటల్లో జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి కిచెను చెక్ చేస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక, జూన్ 9 ప్రభాతవార్త :** తార్నాక చౌరస్తాలో ఉన్న డెక్కన్ పామ్ రెస్టారెంట్‌లో నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కుళ్లిపోయిన చికెన్ ఉపయోగించి బిర్యానీ ప్రజలకు అందిస్తున్నారన్న ఫిర్యాదులపై స్పందించిన ఆమె రెస్టారెంట్లో జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా కుళ్ళిన, అన్‌హైజీనిక్ ఆహార పదార్థాలు గుర్తించారు. దేవిదంగా అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం విక్రయాలు జరుపుతుండటాన్ని గుర్తించారు. పాడైన గుడ్లు, ఆహార పదార్థాలను వంటకాల తయారీ వినియోగిస్తున్నట్టు గుర్తించారు. ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న హోటళ్లపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె రెస్టారెంట్ యజమాని,సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులతో మాట్లాడిన ఆమె రెస్టారెంట్లో స్వాధీనం చేసుకున్న ఆహార పదార్థాలకు పరీక్షలు నిర్వహించి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆహార నాణ్యతకు దూరమైన అన్ని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా నగర ప్రజల ఆరోగ్యం, భద్రతను కాపాడేందుకు తాము కట్టుబడి ఉన్నామని డిప్యూటీ మేయర్ స్పష్టం చేశారు. హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు తగిన నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని అన్ని రెస్టారెంట్లు, హోటల్స్, టిఫిన్ సెంటర్లలో ఫుడ్ సేఫ్టీని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ చర్యలు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంలో కీలకమని అభిప్రాయపడ్డారు.

# 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

**-విద్యార్థులకు పండగ వాతావరణంలో స్వాగతం పలకాలి**
**-ప్రతి ఒక్కరికీ యూనిఫాం, టెక్స్‌బుక్స్,నోట్‌బుక్స్అందజేయాలి**
**-అధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తదితరులు

**హైదరాబాద్,జూన్ 9,ప్రభావార్త:** పాఠశాలల పునః ప్రారంభోత్సవం జూన్ 12న జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణం లాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లోవిద్యా, వైద్య, సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల పునః ప్రారంభం రోజైన జూన్ 12న జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పండగ వాతావరణంగా ఉండాలని పాఠశాలల్లో తోరణాలు కట్టి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు స్వాగతం పలకాలని సూచించారు. హైదరాబాద్ జిల్లాలో 1,03,912 జతల ఏకరూప దుస్తులు, 9,63307 టెక్స్ట్‌బుక్స్,6,25,660 నోటుబుక్స్,1,47,951కావాల్సి ఉన్నాయని వాటిని జూన్ 12 లోగా వందశాతం పిల్లలకు అందించాలని ఆదేశించారు. బడిబాట యాప్ ను ఇన్‌స్టాల్ చేసుకునిదాని ద్వారా పర్యవేక్షణ చేయాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజున వసతి గృహాల్లోనికిచెన్ రూమ్, బెడ్ రూమ్, స్టోర్ రూమ్, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ చేపట్టాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలపర్యవేక్షణ చేయాలని, ఏమైనా పెండింగ్ పేమెంట్స్ ఉంటే వెంటనే చెంబులు చెల్లింపులు చేయడం జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాల పైబడిన పిల్లలు 1941 ఉన్నారని వారందరూ పాఠశాలలకు వచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో 21 భవిత సెంటర్లు ఉన్నాయని వాటిని రెన్యూవేషన్ చేయాలనిభవిత సెంటర్ లను నీట్ ఉండేలా చూడాలన్నారు. భవిత సెంటర్లు లేని చోట ప్రతిపాదనలు పంపాలని ప్రతి మండలంలోఎక్కడెక్కడ సెంటర్లు లేవో గుర్తించిప్రతిపాదనలు పంపాలని అన్నారు. క్షేత్రస్థాయిలో డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్‌లు పర్యవేక్షణ చేయాలన్నారు.బాల్ భరోసా సర్వే అయిపోయిందని డేటాను యాప్ లో ఫీడ్ చేయడం జరిగిందని అన్నారు. సిడిపిఓలు అంగవైకల్యం, క్రిటికల్ సర్జరీ చేయవలసి ఉన్న పిల్లలకు తమ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలకు తీసుకువెళ్లి బాలభరోసా కింద వైద్య సేవలు అందించేందుకు జాబితా తయారు చేయాలన్నారు. అమ్మ మాటఅంగన్వాడి బాట కార్యక్రమంలో రెండు సంవత్సరాలు గల పిల్లలకు అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని, సిడిపిఓ, సూపర్వైజర్‌అంగన్వాడి వారీగా డేటా ఇవ్వాలని, జూన్ 12న అంగన్వాడి కేంద్రం పునః ప్రారంభం రోజున పిల్లలు, వారి పేరెంట్స్ వచ్చేలా పెద్ద ఎత్తున క్యాంపెన్ చేసి అంగన్వాడి కేంద్ర ను మంచిగా డెకరేషన్ చేయాలన్నారు. తమ పరిధిలో ప్రమాదకర స్థితిలో అంగన్వాడి కంద్రాలు ఏమీ లేవని ధ్రువీకరించాలన్నారు.అద్దె భవనాల్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని సూచించారు. ఈసమావేశంలో డిఆర్‌ఓ ఈ వెంకటాచారి,డిఈఓ ఆర్. రోహిణి, డీఎ అండ్ హెచ్ ఓడాక్టర్ వెంకటి, జిల్లా సంక్షేమ అధికారులు ఆర్ కోటజీ, ఇలియాజ్ అహ్మద్, డాక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురంలో న్యాయవాది కిడ్నాప్

**-సకాలంలో స్పందించి కిడ్నాపర్లను రిమాండ్‌కు తరలించిన వనస్థలిపురం పోలీసులు**

**వనస్థలిపురం మే9, ప్రభాతవార్త :** వనస్థలిపురంలో న్యాయవాది కిడ్నాప్ కేసు కలకలం రేపింది.సకాలంలో స్పందించిన వనస్థలిపురం పోలీసులు కిడ్నాపర్లను అరెస్ట్ చేసి, న్యాయవాదిని తీసుకువచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురం, చింతలకుంట, సరస్వతీ నగర్‌లోని ఎస్.ఎన్. ఆర్.అపార్ట్మెంట్ లో హైకోర్టు న్యాయవాది పాలడుగు నారాయణ నివాసముంటున్నారు.కాగా ఈనెల 7న నారాయణ కోర్టుకు వెళ్ళాడు. సాయంత్రం వరకు తిరిరాలేదు. వెంకటేష్ అనే వ్యక్తి నారాయణ భార్య కు ఫోన్ చేసి నీ భర్త ను కిడ్నాప్ చేసాము. కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసాడు.8వ తేదీన నారాయణ భార్య సువర్ణమ్మ వనస్థలిపురం పోలుసులకు పిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సువర్ణమ్మ కు వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా లొకేషన్ గుర్తిచారు.ప్రకాశం జిల్లా, ఎర్ర గొండపాలెం లొకేషన్ రావడంతో, పోలీసులు అక్కడికి వెళ్లి న్యాయవాది ని కిడ్నాప్ చేసిన వెంకటేష్,అతని సోదరి సరస్వతి ని అదుపులోకి తీసుకొని ,న్యాయవాది నారాయణ ను వనస్థలిపురం తీసుకువచ్చారు.తనకు భూమి ఇప్పిస్తానని నారాయణ 2020 లో 35 లక్షలు తీసుకున్నాడని,డప్పులు ఇవ్వకపోవడం తో నారాయణ ను కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లినట్లు వెంకటేష్ ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని వెంకటేష్,సరస్వతి లను రిమాండ్ కు తరలించారు. మరో నిందితుడు గణేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.కాగా 2020 లో తమకు నగరంలో భూమి ఇప్పిస్తానని తమ బంధువైన అడ్వకేట్ నారాయణ 35 లక్షలు తీసుకున్నాడు అని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. డబ్బులు ఇవ్వకుండా ,భూమికి సంధించిన యజమాని వివరాలు చెప్పకుండా కాలయాపన చేస్తున్నాడని దీంతో తాము డబ్బు విషయం పెద్దల సమక్షంలో మాట్లాడుకునేందుకు కారులో ఊరికి తీసుకెళ్లామని వెంకటేష్ ,సరస్వతి లు తెలిపారు.

## పేదల వైద్య సేవలకు సహకారం

### - ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** నియోజకవర్గానికి చెందిన అనిల్‌కుమార్, రాజేశ్వరిలు అనారోగ్యంతో సతమతమవుతున్న దశలో సమాచారం అందుకున్న స్థానిక శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ వారికి రూ. నాలుగున్నర లక్షల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సీ) పత్రాలను సితాఫలమండీలోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో సోమవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన, భారంగా మారిన దశలో వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని పద్మారావు గౌడ్ అన్నారు. ప్రజలు అత్యవసర సందర్భాల్లో సితాఫలమండీ లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



లాలాపేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ఇతర బీజేపీ శ్రేణులు

**తార్నాక, జూన్ 9 ప్రభాతవార్త :** పర్యావరణం పరిరక్షణ కార్యక్రమంలో బాగంగా తార్నాక డివిజన్‌లోగల లాలాపేటలోని జయశంకర్ స్టేడియం గ్రౌండ్ లో తార్నాక డివిజన్ అధ్యక్షులు బండారు ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు, బిజెపి సీనియర్ నాయకులు వెంకటరమణి పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి భాధ్యత అని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు ఒక్కో ఇంటికి ఒక్క మొక్కనాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కందాడి నాగేశ్వర్ రెడ్డి,రవిప్రసాద్ గౌడ్, పర్యావరణం పరిరక్షణ జిల్లా కన్వీనర్ ప్రభుగుప్త అసెంబ్లీ కన్వీనర్ పోచయ్య యాదవ్, డివిజన్ అధ్యక్షులు బండారి ఉపేందర్ యాదవ్, తార్నాక డివిజన్ పర్యావరణ పరిరక్షణ కన్వీనర్ తునుకోజు శ్రీనివాస్ చారి, వెంకటేష్ గౌడ్,వేణు యదవ్, కనకట్ల హరి, సుక్క గణేష్ ముదిరాజ్, బిక్షపతి యాదవ్, వీరన్న, కో..కన్వీనర్ జమ్మికుంట వేణు, కృష్ణమూర్తి, రాజుజైన్, ప్రకాష్ గౌడ్, రాము వర్మ, ప్రమోద్ కుమార్, ప్రవీణ్ గౌడ్, అయ్యప్ప రెడ్డి, కరుణాకర్, మహేష్, నేతికర్ మహేష్, నరసింహ, గోపి, సత్యవతి, అనూష, సరోజ, మమత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాభీష్టం మేరకు అభివృద్ధి : ఎమ్మెల్యే మర్రి



బాక్స్ డ్రైన్ పనులు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

**అల్వాల్, జూన్ 9 ప్రభాతవార్త:** ప్రజలు అభిష్టం మేరకు నడుచుకుంటామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని ఫార్చ్యూన్ ఎన్‌క్లేవ్‌లో 89లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న బాక్స్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. సంవత్సరాలు కాలంగా ఉన్న సమస్య అతి త్వరలోనే తీరనున్నదని మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజావసరాలను తీర్చడం తన బాధ్యతని ఇందుకు అన్ని వర్గాలు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులుతో పాటుగా బిఆర్ఎస్ నేతలు దోలి రమేష్, నరేందర్ రెడ్డి, శోభన్, లక్ష్మణ్ యాదవ్, వెంకటేష్ యాదవ్, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దాతృత్వం

### - శానిటేష్ ఎస్ఎఫ్ఐ కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం



నగదును అందిస్తున్న కాంగ్రెస్ నేతలు

**అల్వాల్, జూన్ 9 ప్రభాతవార్త:** అల్వాల్, మల్కాజిగిరి సర్కిల్‌లలో విధులు నిర్వహించి అకాల మరణం పొందిన ఎస్ఎఫ్ఐ నాగరాజు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అండగా నిలిచారు. సోమవారం నాగరాజు సతీమణికి మైనంపల్లి 5లక్షలు రూపాయలు ఆర్థిక సహకారాన్ని కార్పొరేటర్లు జితేందర్‌నాథ్, ప్రేమ్‌కుమార్ ఇతర కాంగ్రెస్ నేతలు ద్వారా అందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు చంద్రశేఖర్, నిమ్మ అశోక్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, కృష్ణ గౌడ్, సురేందర్ రెడ్డి, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం..

**నిజాంపేట్, జూన్ 9, ప్రభాతవార్త**

నిజాంపేట సబ్ స్టేషన్ నుండి 11కేవీ నిజాంపేట ఫీడర్ లో ఉదయం 9గంటల నుండి 12 గంటలు వరకు జర్నలిస్ట్ కాలనీ, బండారి లేఅవుట్ రోడ్ నం 1 నుండి 10, నిజాంపేట గ్రామం, న్యూ శ్రీనివాస కాలనీ అలాగే 11కేవీ భవ్యాస్ ఫీడర్ లో మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటలు వరకు నిజాంపేట ప్రధాన రహదారి, రత్నదీప్, పాలంపల్లి విల్లాలు, గ్రీన్ అవెన్యూ, బాలాజీ వెస్ట్ కౌంటీ, బాలాజీ పార్క్ టౌన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారుల సహకరించాలని నిజాంపేట ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు.

**మల్లంపేట, ఏసి టైర్స్ ఫీడర్‌లలో..**

11కేవీ మల్లంపేట, ఏసీ టైర్స్ పరిధిలో నేడు ఉదయం 10 నుండి మధ్యాహ్నం వరకు కేవీఆర్ రెయిన్బో కాలనీ, కె ఆర్ సి ఆర్ కాలనీ, బ్లాక్ డైమండ్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

## రాజకీయాలకు అతీతంగా దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

### -రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్
### -భోలక్‌పూర్ భవానీ శంకరాలయ కమిటీ చైర్మన్‌గా మేడి సురేష్ నియామకం



నూతన చైర్మన్, ధర్మకర్తలచే ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

**ముషీరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా దేవాలయ అభివృద్ధికి కృషి భవానీ శంకరాలయ నూతన కమిటీ సభ్యులకు రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ సూచించారు. సోమవారం భోలక్‌పూర్‌లోని దేవునితోట భవానీ శంకరాలయం నూతన కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికయిన మేడి సురేష్ , మరియు ఇతర కమిటీ సభ్యులతో ఆయన ఆలయ ఈవో జ్యోతితో కలసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆలయ కమిటీ ధర్మకర్తలు దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ బాద్యతను సేవాభావంతో చూడాలని, కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకుని, ఆలయ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అన్నారు. రాబోయే బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నూతన ఛైర్మన్ మేడి సురేష్, ధర్మకర్తలు నర్సింగ్‌రావు, శ్వేత తదితరులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి, ఆలయ కమిటీ బాద్యతలు అప్పగించినందుకు ఎంపీ అనిల్‌కుమార్‌కు ధన్యవాదములు తెలియచేశారు. ఆలయ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ కప్పనాయాదవ్, డివిజన్ అధ్యక్షులు పెండం శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్, జఫీరుద్దీన్, టీపీసీసీ కార్యదర్శులు కేశవ్, డి.వెంకటేష్, ఏ, బి బ్లాక్ అధ్యక్షులు వీడి కృష్ణ, అంజియాదవ్, లోకేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర ఉన్నంత కాలం ప్రజల హృదయాల్లో ఎస్‌పి బాలు పాట

### -ప్రముఖ రంగస్థల సినీనటులు, రచయిత, దర్శకులు తనికెళ్ళ భరణి



తనికెళ్ళ భరణికి 'ఎస్‌పి.బాలు నటనా పురస్కారం అందించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** చరిత్ర ఉన్నంత కాలం ఎస్‌పి బాలు పాట తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని తనికెళ్ళ భరణి అన్నారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో కొండూరిభారతి సాంస్కృతిక సంస్థ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గానగంధర్వులు, పద్మవిభూషణ్ డాక్టర్ ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం 79వ జన్మదినోత్సవం సందర్భంగా ప్రముఖ రంగస్థల సినీనటులు, రచయిత, దర్శకులు తనికెళ్ళ భరణికి 'ఎస్‌పి.బాలు నటనా పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వాహక సంస్థ అధ్యక్షుడు, గాయకుడు కొండూరి రవి ఆధ్వర్యంలో జరిగింది. వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో అతిథులుగా మాజీ ఎమ్మెల్యే అంబిక కృష్ణ, ప్రముఖ దర్శకులు రేలంగి నర్సింహారావు, శతాధిక చిత్రనిర్మాత డాక్టర్ తుమ్మలపల్లి రామసత్యనారాయణ, గాయకుడు చింతలపూడి త్రినాథరావు, సినీనేపథ్య గాయకుడు వినోద్‌బాబు, సంగీతాచార్యులు కె.రామాచారి, నంది అవార్డుగ్రహీత, గాయనీమణులు శశికళాస్వామి, విజయలక్ష్మి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా '79 పాటలతో ఏకగళ స్వరార్చన' 21 మంది గాయనీ గాయకులతో నిర్వహించిన కార్యక్రమం అందరిని మంత్రముగ్ధులను చేసింది.

## హైదరాబాద్‌కు ధీటుగా బండ్లగూడను అభివృద్ధి చేస్తున్నాం :ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



బండ్లగూడ కార్పోరేషన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, జూన్ 9 ప్రభాతవార్త :** హైదరాబాద్ మహానగరానికి ధీటుగా బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో రూ.5.కోట్ల 81లక్షలతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజి పనులకు కమీషనర్ శరత్ చంద్ర, మాజీ మేయర్ బి.మహేందర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ కార్పోరేషన్‌లో కోట్ల రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులు చేయిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, మంచినీటి పైప్‌లైన్‌లు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు వంటి మౌళిక వసతులకు పెద్దపీఠ వేస్తున్నామని తెలిపారు. వరుసగా నాలుగోసారి రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి, అసెంబ్లీకి పంపించారని, వారి నమ్మకంను వమ్ము చేయకుండా వందల కోట్ల రూపాయలతో నియోజకవర్గంను అభివృద్ధి చేయిస్తున్నాని తెలిపారు. ప్రజలిచ్చిన అధికారంతోనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తున్నానని వివరించారు. నా జీవితం ప్రజలకు అంకితం చేశానని, తుదిశ్వాస ఉన్నంత వరకు ప్రజల మధ్యనే ఉంటూ సేవ చేస్తానని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాలకు సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యతను ఇస్తుండడంతో పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని వివరించారు. అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉంటూ అప్పగించిన పనులను వేగంగా పూర్తి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి, మాజీ కార్పోరేటర్లు తలారి చంద్రశేఖర్, బి.సాగర్‌గౌడ్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, ఏబ్లాక్ అధ్యక్షులు నవీన్, సీనియర్ నాయకులు గణేష్, హరీష్ గౌడ్, ఖాజా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## నగల కోసం వృద్ధురాలి హత్య ...మహిళ రిమాండ్

**నార్సింగి, మే 9 ప్రభాతవార్త :** నగల కోసం వృద్ధురాలిని హతమార్చిన మహిళను నార్సింగి పోలీసులు కటకటాల వెనక్కి పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన బాలమ్మ(75)కు ప్రతి రోజూ ఉదయం వాకింగ్ చేసే అలవాటు ఉంది. ఈ అలవాటునే తనకు అనుకూలంగా మార్చుకొంది హంతకురాలు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్ట కోడూరు గ్రామానికి చెందిన అనిత ఏడాది క్రితం బతుకుదెరువు కోసం ఖానాపూర్‌కు వలస వచ్చి బాలమ్మ ఇంటి సమీపంలో ఉంటుంది. బాలమ్మ ఒంటిపై బంగారు, వెండి నగలు ఉండడంను గమనించిన అనిత ఎలాగైనా వాటిని కొట్టేయాలని పతకం రచించింది. పరిగి వద్ద మంచి ఈతకల్లు లభిస్తుందని, అక్కడికి వెళ్లి తాగి వద్దామని వృద్ధురాలిని ఒప్పించింది. ఈ నెల మూడో తేదీన ఉదయం ఐదున్నర గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వాకింగ్‌కని బాలమ్మ బయటకు వచ్చింది. ఇదే సమయంలో అనితా వృద్ధురాలిని కల్లు పేరుతో వికారాబాద్ జిల్లా కండ్లపల్లి అడవి లోకి తీసుకెళ్లి కల్లు తాగించింది. అనంతరం ఆమెను చంపి ఆమె ఒంటిపై ఉన్న బంగారు గొలుసు, గుండ్లు, వెండి కడియాలు, పట్టీలు తీసుకొని మృతదేహంను అక్కడే వదిలేసి తన గ్రామానికి వెళ్లిపోయిం ది. వాకింగ్‌కని వెళ్లిన బాలమ్మ ఎంతకి ఇంటికి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలలో వెతికారు. కానీ ఆచూకి లభించలేదు. అనితపై అనుమానం వ్యక్తం చేస్తూ నార్సింగి పోలీసుల కు ఫిర్యాదు చేశారు. నార్సింగి పోలీసులు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. చెనుగోముల్ పోలీసులకు వృద్ధురాలి మృతదేహం లభిచండంతో నాలుగో తేదీన కేసు నమోదు చేసి, ఐదో తేదీన కుళ్లిన మృతదేహంకు పోస్టుమార్టం నిర్వ హించి, సంఘటనా స్థలంలోనే ఖననం చేశారు. నార్సింగి పోలీసులు అనిత గ్రామానికి వెళ్లి, ఆమెను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారిస్తే నగల కోసం తానే హత్య చేసినట్లు అంగీకరించింది. కండ్లపల్లి అడవిలోకి తీసుకెళ్లి స్పాట్‌ను పోలీసులకు చూపించింది. పూడూరు మండల తహసీల్దార్ అనుమతి తీసుకొని గుంతలో ఉన్న వృద్ధురాలి మృతదేహంను ఆమె కుటుంబ సభ్యులకు చూయించగా, వారు గుర్తించారు. అనిత వద్ద నుంచి నగలన్నీ రికవరీ చేసి, ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు నార్సింగి పోలీసులు వివరించారు.

## జిహెచ్ఎంసి అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉంది: జగదీశ్వర్‌గౌడ్



శేరిలింగంపల్లి నియోజక వర్గ సమస్యలపై నగర మేయర్‌తో చర్చించిన జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, జూన్ 9 ప్రభాతవార్త**

కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వానికి జీహెచ్ఎంసీ అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉందని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మాదాపూర్, హఫీజ్‌పేట్; కొండాపూర్ డివిజన్ల పరిధిలోని శ్మశాన వాటికల అభివృద్ధి పనులు, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, నల్లగండ్ల చెరువు అభివృద్ధి, నాలా పనులపై నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగర అభివృద్ధికి నిరంతరం కృషి చేయటం జరుగుతుందని,హైదరాబాద్ నలుదిక్కుల చేప ట్టాల్సిన అభివృద్ధి పనులపై జోనల్ పరిధిలో సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిల్ల శ్రీదర్‌బాబు, పొన్నం ప్రబాకర్ నాయకత్వంలో నగర ప్రగతికి ప్రణాళికలు సిద్ధం చేసున్నామన్నారు. నిత్యం నద్దీగా ఉండే మంజీరా రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఇప్పటికే నియోజక వర్గ పరిధిలోని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను స్టాడింగ్ కమిటీలో చర్చించి నిధులు మంజూరు చేయటం జరుగుతుందని తెలిపారు.

## నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిరంతర వైద్య సేవలు



ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లోని వైద్యశిభిరంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి

**హైదరాబాద్,జూన్ 6,ప్రభాతవార్త:** నాంపల్లిఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన చేప మందు ప్రసాదం కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిరంతరము వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్యాంపులను ఆయన పరిశీలించారు. శనివారము ప్రతేక బృందాలు ఏర్పాటు చేసి ఒక్కొక్క టీం లో ఒక వైద్యునితోపాటు నలుగురు సిబ్బందితో అన్ని రకాల మందులు, బెడ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేప ప్రసాదానికి వచ్చి అస్వస్థకు గురై వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి చికిత్స, మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు.పకడ్బందీ ప్రణాళిక ప్రకారం వైద్యులు, సిబ్బంది నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నారని తానుసైతం ఎగ్జిబిషన్‌గ్రౌండ్ లోనే ఉంటూ క్యాంపుల పర్యవేక్షణ , ప్రత్యక్షంగా రోగులకు చికిత్స చేసి ప్రజలకు చికిత్స మందులు, ఇవ్వడం జరిగిందన్నారు. గత నాలుగు రోజుల నుంచి అస్వస్థకు గురైన1248 వైద్య శిబిరంలో పరీక్షలు, చికిత్స తీసుకోవడం జరిగిందని 11మంది రోగులను ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కు రిఫర్ చేయడం జరిగింది. వారు కూడా పూర్తిగా కోలుకున్నారని తెలిపారు.

## నిధులు నేను మంజూరు చేయిస్తే కాంగ్రెస్,బిఆర్ఎస్ డబ్బా కొట్టుకుంటున్నాయి

### -ఎంపి ఈటెల రాజేందర్



మీడియా సమావేశంలో ఎంపి

**అల్వాల్, జూన్ 9 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని రైల్వే అభివృద్ధి పనులకు సంబంధించి కేంద్రం నుంచి నిధులు కొట్లాడి మంజూరు చేయించానని కాని కొందరు తమకు తాము డబ్బా కొట్టుకుంటున్నారని ఎంపి ఈటెల రాజేందర్ ధ్వజమెత్తారు. నడిచే సిసి రోడ్డు, పారే మురికి కాలువ, పెరిగే మొక్కలు, తినే బియ్యం మొత్తం కేంద్ర ప్రభుత్వ పధకాలనే విషయం మరువరాదన్నారు. స్థానిక రైల్వే అధికారులు వద్దకు వెళ్ళి వినతి పత్రాలు అందించినంత మాత్రాన నిధులు మంజూరు అవుతాయా అని ప్రశ్నించారు. మల్కాజిగిరి అసెంబ్లీతో పాటుగా తన పార్లమెంటరీ పరిధిలోని రైల్వే సమస్యలకు చెక్ పెట్టడానికి కోట్లాది రూపాయలు కేంద్రం నుంచి నిధులు విడుదల చేయించానని పేర్కొన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని తుర్కపల్లి, బొల్లారం రైల్వే గేటు, జనప్రియ హోమ్స్‌లు వద్ద ఆర్‌యుబిల నిర్మాణాలు కోసం పార్లమెంట్‌లో ప్రస్తావించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటుగా గతంలో పాలన చేసిన బిఆర్ఎస్ నేతలు తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మేడ్చెల్ జిల్లాలో రైల్వే ఇబ్బందులను తొలగించడానికి వేల కోట్లు కేంద్రం నిధులు మంజూరు చేసిన విషయం మరువరాదన్నారు. రైల్వే స్టేషన్‌లు ఆధునీకరణతో పాటుగా రైల్వే గేట్లు వద్ద ఆర్‌యుబిలు పనులు ఎన్‌డిఎ పుణ్యమే అని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు ఫొటోలకు ఫోజులు ఇవ్వకుండా ప్రజాభ్యుదయం కోసం పని చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బిజెపి నేతలు మల్లారెడ్డి, మాణిక్య రెడ్డి, మల్లిఖార్జున్ గౌడ్, మహిపాల్ రెడ్డి, దండుగుల వెంకటేష్, గోపు రమణారెడ్డి, కరుణశ్రీ, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

## జలమండలిలో ఎన్నికలు నిర్వహించాలి

### -కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌ను కలిసిన కార్మిక సంఘాల ప్రతినిధులు



ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న జలమండలి ట్రేడ్ యూనియన్ సంఘా ప్రతినిధులు

**చిక్కడపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** జలమండలిలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని పలు సంఘాల నాయకులు కోరారు. సోమవారం ఈ మేరకు జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ బి2898, టీఎంయూబీ 2706, ఎం హెచ్ డబ్ల్యు,ఎస్బీ 315, డబ్ల్యూ,డబ్ల్యూ యు 2873, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి యు బి1929, ఇతర ఐక్య యూనియన్ సంఘాల ప్రతినిధులు ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో జంటనగరాల జాయింట్ కమిషనర్(జెసిఎల్) సునీతను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సతీష్ కుమార్, వాటర్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డి లు మాట్లాడుతూ గత సంవత్సరం మే నెలలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామన్న అధికారులు నేటికి పూర్తి చేయలేదని తెలిపారు. ఇప్పటికీ ఎలాంటి స్పష్టత లేకపోవడం వల్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు.ప్రతినిధిత్వం లేని పరిస్థితుల్లో యాజమాన్యానికి ఉద్యోగుల డిమాండ్లు వివరించలేకపోవడంతో సమస్యలు అక్కడికక్కడే నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఎన్నికల నిర్వహించాలనికోరారు.యూనియన్ల నాయకులుఎండీ. జాంగిర్, అల్లి శ్రవాన్ కుమార్, రాఘవేంద్ర రాజ్, ఈ.చంద్రశేఖర్, బి.దేవేందర్, టీ.వి.లక్ష్మణ్ కుమార్, రమేష్, ఎం.రాజా, అజయ్ నాథ్, బి.శంకర్ ప్రకేష్, సి.రాజు ఎం.రాంచేందర్ బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

### -ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



వైద్య ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** వైద్యఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని పట్టాభి టవర్స్ లో నెస్టోరియా ఒరియా ఫౌండేషన్, వాసన్ కేర్, అపోలో హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై ప్రారంభించి ప్రసంగించారు. పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈ శిబిరాలను ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఫౌండేషన్ చైర్మన్ వీరలక్ష్మి ౖ, గూడూరి శ్రీనివాస్, సిఎస్ రావు, రవి అయకరి, గంగాధర్ రావు, వంశీ రామరాజు, జి ఆర్ సుజాత పాల్గొన్నారు.

## మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం లేదు

### -టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గ విస్తరణలో సామాజిక న్యాయం చేశామంటూ కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవటం విడ్డూరంగా ఉందని, అసలు మంత్రి వర్గ విస్తరణలో సామాజిక న్యాయమే లేదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత కలిగిన పదవులన్నీ అగ్రవర్ణాలకు ఇచ్చి, ప్రాతినిధ్యం లేని, పనికిరాని పదవులన్నీ బలహీన వర్గాలకు, నిమ్న జాతి వాళ్లకు ఇవ్వటం సామాజిక న్యాయమా అని ప్రశ్నించారు. నగరంలో కోటీ ఇరవై లక్షల జనాభా ఉన్న ప్రాంతానికి కనీస ప్రాధాన్యత కూడా ఇవ్వకపోవటం ఏం న్యాయమన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ నాయకులకు గులాంగిరి చేస్తూ పదవులు తెచ్చుకుంటున్న వైనం నశించాలని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని కించ పరచవద్దని కోరారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, భానుప్రకాష్, సుక్రవేది తదితరులు పాల్గొన్నారు.

## పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

### -జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్



స్థానికులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

**పేట్ బషీరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త**

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పార్కు స్థలాలను సోమవారం పరిశీలించారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వైష్ణవి ఎంక్లేవ్‌లో ఉన్న 2017 గజాల పార్కు స్థలాన్ని పరిశీలించి వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని హార్టికల్చర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పార్కు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభ, జోనల్ మేనే జర్ రఘువీర్ రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం. పి. ఆర్ చంద్రశేఖర్, కోశాధికారి రాకేష్ కుమార్, రాజు, కిరణ్, ఆర్గనైజర్ శివకుమార్ పాండే పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రజావాణిలో ఫిర్యాదు



ఉప కమిషనర్ నరసింహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానిక నాయకులు

**జీడిమెట్ల, జూన్ 9, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణిలో సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్‌లో పారిశుధ్య పనులు సరిగా చేయకపోవడంతో ఎక్కడకక్కడ చెత్త చెదారం ఎక్కువగా ఉండటం, సరైన సూపర్వైజర్ లేక కాలనీ అపరిశుభ్రంగా తయారవుతుందని స్థానిక నాయకులు, కాలనీవాసులు సోమవారం మున్సిపల్ ఉప కమిషనర్ నరసింహన్ దృష్టికి తీసుకువెళ్లి ప్రజావాణిలో పిర్యాదు చేశారు. రానున్నది వర్షాకాలం కనుక పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, శానిటేషన్ మీద పూర్తిగా దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. పార్కులో ఎంట్రెన్స్ బోర్డు ఏర్పాటు చేయాలనీ కోరారు. సానుకూలంగా స్పందించిన ఉప కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుబ్బల లక్ష్మీనారాయణ, ఆలూరి వెంకట శేషాచారి, పివి భాస్కర్ రెడ్డి, పూర్ణచంద్రగుప్త, కూరపాటి ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

## హర్యానా గవర్నర్‌ను కలిసిన పాతబస్తీ బిజెపి నాయకులు



హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసిన బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

**చార్మినార్,జూన్ 9 ప్రభాతవార్త :** హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను పాతబస్తీ చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బిజెపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మర్యాద పూర్వకంగా కలిశారు.శాలువ కప్పి బండారు దత్తాత్రేయను సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జెపి నాయకులు మహ్మద్ అబ్దుల్ సత్తార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## 10న వరద ముప్పు బస్తీ వాసులు నిరసన



సమావేశంలో పాల్గొన్న జేఏసీ ప్రతినిధులు

**చార్మినార్,జూన్ 9 ప్రభాతవార్త :** పాతబస్తీ హనుమాన్ నగర్ ఫేస్ 2 కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం గౌలిపుర డివిజన్ పరిధిలోని వరద ముప్పు ప్రాంతాల బస్తీ వాసులు జేఏసీగా ఏర్పడి సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో జేఏసీ సభ్యులు తమ కార్యచరణాన్ని ప్రకటించారు.జూన్ నెల 10వ తేదీ మంగళవారం చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.కాగా అచ్చయ్య నగర్,హనుమాన్ నగర్,అంబికా నగర్,పటేల్ నగర్ ప్రాంతాలు వరద ముప్పు వల్ల మునిగి పోతున్నాయని,వరద కారణంగా ఈ బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్న పట్టించు కోవటం లేదని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమావేశంలో హనుమాన్ నగర్ అధ్యక్షులు గోపీ, సలహాదారులు శివ చంద్రగిరి,చైర్మన్ నరసింహగౌడ్, చంద్రమోహన్,అంబికా నగర్ అధ్యక్షులు మురళీ,దేవేందర్,డల్లు శివ, శ్రీరామ కోటయ్య, హనుమాన్ నగర్ ఫేస్ 3 ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ గౌడ్,శ్రీనివాస్,పటేల్ నగర్ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్,సర్వేష్,బుంగ శివకుమార్,అచ్చయ్య నగర్ అధ్యక్షులు శ్రీ రాములు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు సన్మానం



అడ్లూరి లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వివేకానంద నగర్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ నాయకులు

**వివేకానంద నగర్ కాలనీ, జూన్ 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం క్యాబినెట్ విస్తరణ నేపథ్యంలో రాష్ట్ర మంత్రివర్గంలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, సీనియర్ కాంగ్రెస్ నేత అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి వరించడంతో సోమవారం గవర్నర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వివేకానంద నగర్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి నాయకుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా తరువాత ఎమ్మెల్యేగా ప్రభుత్వ విప్‌గా ఉన్న ఆయనకు మంత్రి పదవి లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాషిపాక యాదగిరి, నాయకులు కుమార్ యాదవ్, సంజీవరావు, శివరాత్రి యాదగిరి, బొల్లం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## చేప ప్రసాదం వేయించుకున్న కార్పొరేటర్



**అఫ్జల్‌గంజ్,జూన్ 9ప్రభాతవార్త:** మృగ శిర కార్తెను పురస్కరించుకుని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ చేప ప్రసాదాన్ని వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా మృగశిర కార్తె సందర్భంగా చేప ప్రసాదాన్ని వేయించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని వర్గాల అధికారులు సమన్వయంతోవ్యవహరించినట్లు చెప్పారు. ముఖ్యంగా స్వచ్చంద సంస్థలు ఆల్పహారం, మంచినీటి ప్యాకెట్లు రోగి వెంట వచ్చిన వారికి అందచేయడం అభినందనీయమన్నారు.

## అర్బన్ హెల్త్ సెంటర్‌ను కూల్చొద్దు : సిపిఎం

**అడ్డగుట్ట, జూన్ 9 ప్రభాతవార్త:** అడ్డగుట్ట అర్బన్ హెల్త్ సెంటర్‌ను కూల్చాలనుకోవడం ప్రభుత్వ నిధులు వృథా చేయడమేనని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఎం.అజయ్‌బాబు తెలిపారు. ఈ భవనాన్ని కూల్చొందని కలెక్టర్‌కు ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బనల్ సెంటర్‌ను కూల్చి కేవలం 35 పడకల ఆసుపత్రిని నిర్మించాలనుకుంటున్నారని తెలిపారు. దాదాపు మరో 40 సంవత్సరల వరకు ఉపయోగపడే భవనాన్ని కూల్చి కొత్తది నిర్మించాలనుకోవడం తగదన్నారు. ఆక్రమణకు గురైన స్థలాలు ఉన్నాయని, వాటిలో ఆస్పత్రిని నిర్మించాలని కోరారు. అలాగే ప్రస్తుత అర్బన్ హెల్త్ సెంటర్‌ను తహసీల్దార్, లేదా మరోక ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయంగా ఉంచాలని డిమాండ్ చేశారు.

## ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జూన్ 9 ప్రభాతవార్త:** బోయిన్ పల్లి, బాపూజీ నగర్‌లోని శ్రీ పోచమ్మ దేవాలయం 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తానని శ్రీగణేష్ హామి ఇచ్చారు. ఆలయ కమిటి సభ్యులు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించడం పాటు అర్చకులు ఆయనకు ఆశీర్వచనం తీర్థ ప్రసాదాలు అందించారు.

## శ్రీపోచమ్మ ఆలయ 15వ వార్షికోత్సవ ప్రత్యేక పూజలు



వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, జూన్ 9 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు న్యూ బోయినపల్లి బాపూజీనగర్‌లోని శ్రీ పోచమ్మ ఆలయ 15వ వార్షికోత్సవం ఘనముగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన అభిషేకం. తీర్థప్రసాద వితరణ. అన్నదానం కార్యక్రమాల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిధిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకర్. సంపత్ కుమార్. కనక రాజు. రాము. అజిత్. ప్రేమ్ ముదిరాజ్. శ్రీ కాంత్. బాలకృష్ణ. నాగరాజు. మురళి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో సమస్యలు పరిష్కరిస్తా : సంతోష్ యాదవ్



కుమ్మరిగూడలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ నేత సంతోష్ యాదవ్

**అడ్డగుట్ట,జూన్ 9 ప్రభాతవార్త:** మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న ఎసమస్యలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన కుమ్మరిగూడలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్థంగా ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తెచ్చా సమస్యలు పరిషష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# వరద ముంపు ప్రాంతాలపై హైడ్రా ఫోకస్

**-నాలాల పరిశీలన..నీటమునిగే ప్రాంతాల గుర్తింపు**
**-భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు**
**-తాజాగా మాదాపూర్‌లో పర్యటించిన కమిషనర్ రంగనాథ్**



మాదాపూర్ దుర్గంచెర్వు ప్రాంతంలోని నీటిని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్

**హైదరాబాద్,జూన్ 9,ప్రభాతవార్త:** నగరంలోని వరద ముందు ప్రాంతాలపై హైడ్రా ఫోకస్ పెట్టింది. ఎక్కడెక్కడ ముంపు ప్రాంతాలు ఉన్నాయి. అక్కడ నీరు నిలవడానికి గల కారణాలు ఏంటి...నాలా పనితీరును ఏంటి..భవిష్యత్ వరద నీరునిలవకుండా ఉంటే ఏంచేయాలని అనేదాన్ని పరిశీలించి స్థానికుల సూచలను సేకరిస్తుంది. ఈమేరకు సోమవారం మాదాపూర్‌లోని వరద ముప్పు ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ే క్షేత్ర స్థాయిలో పర్యటించారు. అక్కడ నాలాల్లో వరద సాఫీగా సాగుతుందా లేదా.. ఎక్కడైనా ఆటంకాలున్నాయా అనే అంశాలను పరిశీలించారు. వర్షం పడితే నీట మునుగుతున్న నెక్టార్ గార్డెన్స్ పరిసరాలలో వర్షపు నీరు నిలవకుండా తీసుకోవాల్సిన చర్యలపై జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, జలమండలి అధికారులతో చర్చించారు. దుర్గం చెరువుకు ఎండాకాలంలో కూడా నీటి కొరత వుండదు కనుక.. వర్షాకాలంలో నీటి నిలువల స్థాయిని తగ్గిస్తే వరద పోటెత్తదని అధికారులు సూచించారు. వర్షం పడితే నడుము లోతు నీళ్ల తమ కాలనీలో నిలబడుతున్నాయని స్థానికులు కమిషనర్ కు విన్నవించారు. దుర్గం చెరువుకు ఇన్ ఫ్లో ఎంత మొత్తంలో ఉంది.. ఔట్ ఫ్లో ఎంతనే అంశాలను చెరువు చుట్టూ తిరిగి పరిశీలించారు. చెరువులోపల తూములను, గేట్లను కూడా తిలకించారు. ఇందులో ఏ గేటు ఎత్తితే ఎంత నీరు వెళ్తుంది.. అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో దుర్గం చెరువుపై సమీక్ష.. దుర్గం చెరువులో నీటిమట్టం నిర్వహణపై ఇరిగేషన్, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్ నిర్ణయించారు. వరద కాలువలను విస్తరించాల్సినవసరం ఉన్నా.. వర్షాకాలంలో అయినా కొంతమేర తగ్గిస్తే మాదాపూర్ ప్రాంతంలో వరద ముప్పు తగ్గించడానికి వీలవుతుందా అనే విషయమై ఇందులో చర్చించనున్నారు. అలాగే దుర్గం చెరువు దిగువ భాగంలో ఆక్రమణలతో పాటు.. వరద కాలువకు ఉన్న ఆటంకాలను కూడా పరిశీలించారు. అలాగే దుర్గం చెరువులో ఇనార్బిట్ మాల్ వైపు మట్టి పోయడంపై విచారించారు. అలాగే అక్కడ పార్కు చేసిన వాహనాలకు సంబంధించి వాకబు చేశారు. పూర్తి వివరాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. దుర్గం చెరువు వరద కాలువకు ఆటంకం లేకుండా ఎంత మొత్తం నీరు విడుదల చేసినా సాఫీగా మల్కం చెరువుకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువ..**

నగరంలో నాలాల కబ్జాలపైనా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 58 ఫిర్యాదులందగా ఇందులో 60 శాతానికి పైగా నాలాల కబ్జాలపైనే ఉన్నాయి. నగరంలో ఏ నాలాను పరిగణనలోకి తీసుకున్నా.. వాస్తవ వెడల్పునకు 50 శాతానికి పైగా కబ్జా అయినట్టు పలువురు పేర్కొన్నారు. నాలాలను పూర్తిస్థాయిలో విస్తరించినట్టయితే.. వరదలకు చాలావరకు అడ్డుకట్ట వేయవచ్చునని పలువురు పేర్కొన్నారు. నాలాలు పొంగి ఇళ్లలోకి, అపార్టుమెంట్ల సెల్లార్లలోకి వరద నీరు చేరి విలువైన వస్తువులు కరాబౌతున్నాయని పలువురు వాపోయారు. కార్లు నీట మునగడంతో తూకానికి అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని దుర్గా ప్రావిన్స్ కాలనీ ప్రతి సంవత్సరం వరదలకు గురై తమ ఇళ్ళు, రహదారులు నీటిలో మునిగిపోతున్నాయని సమీపంలోని అనేక కాలనీల నుండి వర్షపు నీటిని నేరుగా తమ వైపు మళ్లించడం ద్వారా మరింత ఇబ్బంది ఏర్పడుతోందని ఒకసారి పరిశీలించి వరద నీటి కాలువలు చెరువులకు అనుసంధానమైనట్టు చూడాలని దుర్గా ప్రావిన్స్ కాలనీ ప్రతినిధులు ఫిర్యాదుచేశారు. అలాగే లంగర్ హౌస్ చెరువు 38 ఎకరాలు విస్తీర్ణంలో ఉండేదని ఇప్పుడు ఆచెరువు 24 ఎకరాలకు మిగిలిందని దాన్ని సైతం కబ్జా చేసేందుకు కొందరు స్థానిక ఎమ్మెల్యే ప్రోత్బలంతో చెరువు ఫెన్సింగ్ ను విరగొట్టి అక్రమంగా రోడ్డు నిర్మాణం చేసి చెరువు స్వభావాన్ని పూర్తిగా మార్చేశారు. ఆక్రమణలను తొలగించి చెరువుకు పూర్వ వైభవం తీసుకువచ్చి ఆధునికరించాలని కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆనంద్‌బాగ్ కాలనీలోని స్ట్రీట్ నంబరు 10, 11 లలో రాకపోకలకు వీలు లేకుండా.. ఆ రెండు రహదారులను 2019 వ సంవత్సరం నుంచి మూసేశారని14 ఏళ్లగా వినియోగించిన రహదారులను మూసేయడంతో తాము వేరే కాలనీల నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోయారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దొమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ప్రగతినగర్ కాలనీలో మొత్తం 300ల కుంటుంబాలుండగా.. ఇందులోని పార్కు స్థలాన్ని కబ్జాచేశారంటూ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదుచేసింది.

## ఆబాలగోపాలాన్ని అలరించిన రవళి కూచిపూడి నృత్యం



నృత్యకళాకారులతో శేషుబాబు, చొక్కాపు, రవళి, రమేష్‌బాబు, నవ్యశ్రీ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూన్ 9 ప్రభాతవార్త :** ప్రముఖ నాట్యగురువు నృత్యప్రవీణ రవళి రమేష్‌బాబు శిష్య ప్రతిష్య బృందం తమ చక్కని ఆహార్యం, శృతి లయబద్ధ హావభావాలతో పలు నృత్యాంశాలను కూచిపూడి నృత్యోత్సవం పేరిట అలవోకగా నవరస భరితంగా ప్రదర్శించి ఆబాలగోపాలాన్ని అలరించి ఆనందసాగరంలో ఓలలాడించారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రవళి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహింపబడిన ఈ కూచిపూడి నృత్యోత్సవంలో చిన్నారులు ముందుగా లంబోదరుడ్ని స్తుతిస్తూ వినాయకస్తుతితో నృత్యోత్సవానికి శ్రీకారం చుట్టారు. తదుపరి బ్రహ్మాంజలి, దశావతారశబ్దం, జావళి, అదివో అల్లదివో, ముద్దుగారె యశోద, పరమపురుషుడు, పలుకే బంగారమాయెన, రామాయణ శబ్ధం, నమఃశివాయతే, నీలమేఘ శరీర, కృష్ణశబ్ధం, కొలువై ఉన్నాడే తదితర అంశాలతోపాటు రవళి రమేష్‌బాబు నృత్యదర్శకత్వంలో నవ్యశ్రీ సందీప్ గంగగా, మేఘన శివుడుగా, వైష్ణవి గౌరిగా గంగ–గౌరి సంవాదం నృత్యరూపకం ఆద్యంతం అద్భుత నాట్యరస పోషణతో నేత్రపర్వంగా ప్రదర్శించి చూపరులకు రక్తికట్టించి రసోప్లావితం కావించారు. ఈ సందర్భంగా చొక్కాపు వెంకటరమణ సభాధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన యక్షగాన కంఠీరవ డా. పసుమర్తి శేషుబాబు, ప్రత్యేక అతిథు లు బాలగంగాధరరావు, మల్లాది వెంకట కుటుంబ శర్మ, రమేష్‌బాబు, నవ్యశ్రీ సందీప్ తదితరులతో కలిసి నృత్యప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులకు జ్ఞా పికలు, ప్రశంసాపత్రాలు బహూకరించి గొప్పకళాకాలుగా ఉజ్వలభవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.

## అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎంఇఓకు వినతి



ఎంఇఓ విజయ్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయుసి నేతలు

**నార్సింగి, మే 9 ప్రభాతవార్త :** గండిపేట మండలంలో ఉన్న అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఏఐటియుసి నాయకులు గండిపేట మండల ఎంఇఒ విజయ్ కుమార్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర నాయకులు మల్లేష్ మాట్లాడుతూ గండిపేట మండ లంలోని చాలా పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవని, ఇరుకైన గదులలో విద్యార్థులను కూర్చోబెడు తున్నారని, ఫీజులు మాత్రం పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని పాఠశాలలకు చెందిన బస్సులకు సరైన ఫిట్‌నెస్‌లు కూడా లేవని, ఎక్కువ మంది విద్యార్థులను బస్సులలో కూర్చోబె డుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఏఐటియుసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని మల్లేష్ హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర య్య, బాబురావ్, శ్రీను, శ్రీకాంత్, సుధాకర్ పాల్గొన్నారు.

### అమ్మవారిని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి

**కంటోన్మెంట్,జూన్ 9 ప్రభాతవార్త:** అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లోని శ్రీ పోచమ్మ ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు బానుక మల్లికార్జున్, ఆలయ కమిటీ సభ్యులు శంకర్, సంపత్, కనకరాజు, అజిత్, రాము, ప్రేమ్ ముదిరాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో వచ్చే సమస్యలపై జోనల్ కమిషనర్‌తో చర్చించిన జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ, రోడ్లు, శానిటైజేషన్ సంబంధిత పనులను అధికారులు సకాలంలో చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి నియోజక వర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ కోరారు. ఈ మేరకు శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కమిషనర్ హేమంత్ భోర్ఖడేకు వినతిపత్రాన్ని అందించారు. సోమవారం శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖడేను కలిసిన జగదీశ్వర్‌గౌడ్ నియోజక వర్గ పరిధిలోని అనేక డివిజన్లలో నెలకున్న సమస్యలను, ఆయా డివిజన్లలో చేపట్టాల్సిన అభివృద్దిపనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల ఆర్జీలను పరిష్కరించటంలో విజయవంతంగా ప్రజా వాణి కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా వచ్చే వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై అధికారులు ముందుగానే జాగ్రత్త వహించాలని, పెండింగ్ పనులను పూర్తిచేయాలని ఆయన జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

## సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి రాజీనామాలు చేస్తున్నాం



పార్టీకి రాజీనామాలు చేస్తున్నామని పేర్కొంటున్న కాంగ్రెస్ నాయకులు

**నార్సింగి, మే 9 ప్రభాతవార్త :** బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవిని ఇవ్వకపోవడంను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పదవుల న్నింటిని రాజీనామాలు చేస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పిసిసి ప్రతినిధి గంగా శంకర్, బ్లాక్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్‌రెడ్డికి అవకాశం ఇవ్వకపోవడంను నిరసిస్తూ సోమవారం నార్సింగిలోని పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఇంటి ముందు బోధన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నేతలు మాట్లాడుతూ మా నాయకుడికి మంత్రి పదవి దక్కకపోవడంను నిరసిస్తూ మేము అన్ని పదవులకు, కాంగ్రెస్ పార్టీకి సామూహిక రాజీనామాలు చేస్తున్నామని వివరించారు. నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బతికి బట్టకట్టాలంటే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే బోధన్ తో పాటు నిజామాబాద్ జిల్లా అంతా కాంగ్రెస్ పార్టీ చతికిల పడిపోతుందని హెచ్చరించారు.

## ప్రభుత్వ కళాశాలలను సందర్శించిన బిజెపి నేతలు...



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కాంతారావు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 9, ప్రభాతవార్త:** నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో కూకట్పల్లి అసెంబ్లీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను సోమవారం భారతీయ జనతా పార్టీ కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో విద్యార్థులకు అందుతున్న మెరుగైన విద్యా విధానాన్ని, అడ్మిషన్ల ప్రక్రియను సంబంధిత ప్రధానోపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రైవేటు విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థలకు విద్యార్థుల వలసలు పెరుగేలా నూతన సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన మెరుగైన విద్యను అందించేందుకు ఏఐ ఆధారిత డిజిటల్ విద్యాబోధన అమలు చేయాలని అదేవిధంగా విద్యార్థులకు మరుగుదొడ్లు, ఆటస్థలంతో పాటు లైబ్రరీ వ్యవస్థను మెరుగు పరచాలని ఈ సందర్భంగా కాంతారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వినోద్ కుమార్ గౌడ్, భగవంత్ రెడ్డి, గోపి, సూరిబాబు, వెంకటరమణ, జగదీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శిగా వేణు న-అభినందనలు తెలిపిన వడ్డేపల్లి



వేణును శాలువాతో సన్మానిస్తున్న రాజేశ్వరరావు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 9, ప్రభాతవార్త:** శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి కే.వేణు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం రాజేశ్వరరావు వేణును శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా వేణును అభినందించి పార్టీ యొక్క పటిష్టతకు అందరిని కలుపునీ పని చేయాలి అన్నారు.

## జయశంకర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు అభినందనలు...



కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌ని కలిసిన నూతన కమిటీ సభ్యులు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 9, ప్రభాతవార్త:** అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జయశంకర్ కాలనీలో జరిగిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షుడిగా భారీ మెజార్టీతో గెలుపొందిన మహేష్ కాలనీ వాసులతో కలిసి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేష్‌ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జయ శంకర్ కాలనీలో త్రాగు నీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి అన్ని మౌలిక సదుపాయాలు అందించామని అన్నారు. ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులు కాలనీ ప్రజలందరికీ అన్నివిధాల సహకారాన్ని అందిస్తూ, కాలనీ అభివృద్ధికి తోర్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్లను విస్మరిస్తే వైఎస్ఆర్‌సికి పట్టిన గతే కాంగ్రెస్‌కి పడుతుంది

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మంత్రి వర్గ విస్తరణలో రెడ్డి సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరిగిందని ఓసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 19 నెలలు తరువాత జరిగిన మంత్రి వర్గ విస్తరణలో కనీసం ముగ్గురు రెడ్డి సామాజిక వర్గానికి అవకాశం కల్పించే వీలు ఉన్నప్పటికి సామాజిక న్యాయం పేరుతో దూరం పెట్టడం శోచనీయమన్నారు. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 6గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా కా ంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి మినహాయించి ముగ్గురు రెడ్డి సామాజికి వర్గానికి చెందిన వారు మ ంత్రులుగా ఉండటం రెడ్లను అవమానించిన ట్లయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం లో వివిధ పార్టీల నుంచి 42 మంది రెడ్డి ఎమ్మె ల్యేలు ఎన్నిక కాగా కాంగ్రెస్ పార్టీ నుంచి 25 మంది రెడ్డి ఎమ్మెల్యేలుగా ఎన్నికకావడం జరిగిందని, ఖ మ్మం, నల్లగొండ జిల్లాలతోపాటు రాష్ట్రంలోని ఆనేక జిల్లాల్లో రెడ్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని తెలిపా రు. రేవంత్‌రెడ్డి సిఎం కాకముందు రెడ్డి సమావేశాలకు హాజరై ఆనేక హామీలు ఇచ్చినా సిఎం అయిన తరువాత నేరవేర్చకపోవడం, ప్రభుత్వం ఏర్పాటు చేసి 19 నెలలు కావస్తున్నప్పటికి రెడ్డి కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి ఛైర్మన్‌ను నియమించకపోవడం సిగ్గు చేటని ఆయన విమర్శించారు. కుల గణన పేరుతో రెడ్లకు అన్యాయం చేయడం, రెడ్లను నిర్లక్ష్యం చేస్తే ఏపిలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు.

## కుస్తీ పోటీలలో విజయం సాధించిన వారికి సన్మానం



మెడల్స్ సాధించిన పవన్‌కుమార్, గణేష్‌లను సన్మానిస్తున్న నిర్వాహకులు

**సికింద్రాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** కుస్తీ పోటీలలో జిల్లా స్థాయిలో రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించిన సికింద్రాబాద్ నియోజకవర్గం మైలార్‌గడ్డ ప్రాంత నివాసులు పవన్‌కుమార్, గణేష్‌లను మైలార్‌గడ్డలోని మారుతి వ్యాయమ శాలలో సోమవారం ఘనంగా సన్మానించారు. వీరిద్దరు మారుతీ వ్యాయామ శాలలోనే ప్రాక్టీస్ పొందుతుంటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎంఎన్ కుమార్, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిలు మాట్లాడుతూ 1946లో ప్రారంభించిన మారుతీ వ్యాయమ శాలలో అనేక మంది శిక్షణ పొంది అనేక మెడల్స్ సాధించారని తెలిపారు. రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో పోటీలలో విజయం సాధించిన వారు ఎంతో మంది ఉన్నారని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎంతో చరిత్ర గల మారుతీ వ్యాయమశాల ఇప్పటి ఆదే ఊపులో కొనసాగుతుందని వివరించారు. ఈ వ్యాయామశాలలో ప్రాక్టీస్ చేసిన వారు విజయాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ్ శ్రీను, జానువా, బ్యాంక్ రమేష్, హరీష్, గిజు శ్రీనివాస్, మాస్టర్‌లు పాల్గొన్నారు.

## మంచుకొండ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మంచుకొండ ఫౌండేషన్ సభ్యులను అభినందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమారి

**సికింద్రాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** గాంధీ ఆసుపత్రి ఆవరణలో రోగుల సహాయార్థం ప్రత్యేకంగా మంచి నీటి ఫిల్టర్లు అందించిన మంచుకొండ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని డాక్టర్ రాజ కుమారి అన్నారు. మంచుకొండ ఫౌండేషన్ గాంధీ హాస్పిటల్‌కి అందించిన ప్రత్యేక నీటి ఫిల్టర్లను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు తమ సేవలను మరింత విస్తరించాలని కోరారు. మంచి నీరు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, ఆర్.యం. ఓ. డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మేనేజింగ్ డైరెక్టర్ మంచుకొండ ప్రకాశం, డాక్టర్ నవీన్, శ్రవణ్ కుమార్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

## మోండా డివిజన్ అభివృద్ధికి కృషి : కొంతం దీపిక



ఈస్ట్ మారేడ్‌పల్లిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

**అడ్డగుట్ట,జూన్ 9 ప్రభాతవార్త:** మోండా డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. సోమవారం ఆమె ఈస్ట్ మారేడ్‌పల్లి టీచర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో జలమండలి, జీహెచ్ఎంసి ఇంజనీర్లతో కలిసి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు వంటి సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని ఇంజనీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం విద్యా సాగర్, ఏఈ శ్రావంతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఆరోగ్య మిత్ర రజతోత్సవాలు ప్రారంభం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్, శ్రీనివాస్

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రారంభించి 25 సంవత్సరాలు గడిచిన సందర్భాన్ని పురస్కరించుకుని రజతోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పరికిపండ్ల అశోక్, ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ గుమ్మడివల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఈ రజతోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యా, వైద్యం, ఆరోగ్యం, యువత, స్త్రీలుపై దృష్టి పెట్టి రెండు తెలుగు రాష్ట్రాలలో 25 అంశాల్లో 25 ప్రాంతాల్లో 25 సంస్థల ద్వారా 25 నెలల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి జిల్లా కేంద్రంలో పోలీసుల సహకారంతో ఆత్మహత్యల నివారణ, యువత కోసం యూత్ ఎంపవర్మెంట్, విద్యార్థుల లో గొప్పగొప్ప ఆలోచనా విధానాలు తీసుకువస్తామన్నారు. తాము చేపట్టిన ఈ కార్యక్రమాలను అందరూ విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## 11న దళిత నాయకత్వ వేదిక ప్రారంభ సమావేశం

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** దళిత నాయకత్వ వేదిక (డీఎల్ఎఫ్) ప్రారంభ సమావేశంలో ఈ నెల 11వ తేదీన తెలుగు విశ్వవిద్యాలయలంలోని ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో జరుగుతుందని వేదిక ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక ప్రతినిధులు లెల్లే సురేష్, పాలడుగు శ్రీనివాస్, డా.తలారి సత్యం వేదిక ప్రారంభానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, గౌరవ అతిధిగా రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మ ంత్రి దనసరి అనసూయ (సీతక్క), ప్రత్యేక అతిధిగా ఎమ్మెల్యే వీరేశం, పలువురు గౌరవ అతిథులు పాల్గొంటారని తెలిపారు. ఈ వేదిక ప్రాథమికంగా దళిత నాయకత్వాన్ని బలోపుతం చేయడం, ఉద్యమాలు, ఉద్యమ నాయక త్వం, నూతన రాజకీయ ఆలోచ నలు, సామాజిక– సాంస్కృతిక కృషితో భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పడిందని తెలిపారు

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD**
**O.S. No. 423 OF 2025**

Between:
**1) Allagani Latha,**
W/o. Late A. Hanumanth Goud,
**2) Allagani Nivas Goud,**
S/o. Late A. Hanumanth Goud,
Both R/o. H.No. 1-3-183/40/108,
Gandhinagar, SBI Colony,
Hyderabad. ...Plaintiffs

**AND**

**1) The Tahsildhar,**
Secunderabad Mandal.
**2) All Concerned** ...Defendants

**NOTICE**

To,
**All Concerned (D2)**

Please take notice that the Plaintiffs herein has filed the above Suit for declaration to declare them as legal heirs of the deceased Allagani Hanumanth Goud, who died intestate on 21.08. 2024. The above said case is posted to **23.06.2025** at 10.30 am. in the above Court. If anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents, either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.

**(BY THE ORDER OF THE COURT)**
Sd/- **J. AKHILA,** Advocates,
H.No. 5-2-26/1,
Rajyalaxminagar, BaghAmeer,
Kukatpally, Hyderabad.
**Cell: 9908737667**

## ఘనంగా ముగిసిన వాసవీ మాత ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలు



శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త.

**వనస్థలిపురం మే9, ప్రభాతవార్త :** వనస్థలిపురం, సచివాలయ నగర్‌లో గల శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ వేడుకల్లో టి. పి.సి.సి.ప్రచారకమిటి రాష్ట్ర కో.కన్వీనర్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కి కృషి చేయడంతో పాటు ,ఆలయాల అభివృద్ధి కి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయ రాములు,అల్లాడి లక్ష్మీనారాయణ, గుంత వెంకటస్వామి, చింతల రజనీకాంత్, రవి, భాస్కర్ అభిషేక్, ఆలయకమిటి సభ్యులు పాల్గొన్నారు.

### పెంచిన బస్ పాస్ ధరలను ఆర్టీసీ యాజమాన్యం వెంటనే వెనక్కి తీసుకోవాలి : శివకుమార్ గౌడ్

**తుర్కయంజాల్ జూన్ 9 ప్రభాతవార్త :** అఖిల భారత యువ జన సమాఖ్య రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ బస్ పాస్ ధరలను 20 పెంచుతూ ఆదేశాలు జారీ చేసిన టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం తీసుకోవాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. టికెట్ల ధరల పెంపుతో సామాన్య ప్రజలతో పాటు, విద్యార్థులు ఎంతగానో ఇబ్బంది పడాల్సి ఉంటుందని అంతేగాక రోజువారి పనులు చేసుకునే ఉపాధి కూలీలకు నిరుద్యోగులకు అంతరాయం ఏర్పడుతుందని వారు అన్నారు. నిత్యవసర సరుకుల ధరల పెంపుతో బెంబేలెత్తుతున్న జనం ఇక బస్సు టికెట్ల ధరలు పెంచితే జీవన ప్రయాణం సాగేది ఎట్లా అని వారు ప్రశ్నించారు. ఆర్డినరీ పాస్ ధరను రూ.1,150 నుండి రూ.1,400 కు, మెట్రో ఎక్స్ ప్రెస్ పాస్ ధరను రూ.1300 నుండి రూ.1600 కు, మెట్రో డీలక్స్ పాస్ ధరను రూ.1450 నుండి రూ 1800 కు పెంచిన ఆర్టీసీ యాజమాన్యం సకలజనులను దృష్టిలో పెంచుకొని మరోసారి పునరాలోచించాలని వారు అన్నారు. ఆర్టీసీ యజమాన్యం ఉచిత బస్సు పథకం వల్ల జరిగే నష్టాన్ని భర్తీ చేయడానికే ప్రభుత్వం ప్రజల మీద భారం వేస్తుందని తాము ఆరోపిస్తున్నట్లు తెలిపారు.

### రంగారెడ్డి జిల్లా ఉషా నూతన కమిటి ఎన్నిక



**హుడా కాంప్లెక్స్, జూన్ 9 , ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా ఉషా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక అయింది. ఆదివారము నమత అపార్ట్మెంట్‌లో జరిగిన సమావేశంలో కమిటీ నీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అద్యక్షుడు గా విపిన్ గులాటి, ఉపాధ్యాక్షునిగా మధుసూదన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గా జె. మనోహర్ కుమార్, కోశాధికారి గా కిరణ్ కుమార్, జాయింట్ సెక్రటరీ లుగా హాసన్, వెంకట్ మురళి, రవి కుమార్లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి బాల కృష్ణ, అడ్వైసర్స్ రవి కుమార్, ఇమాన్ తదితరులు పాల్గొన్నారు.

### బ్యాడ్మింటన్‌షిప్ విజేతలకు బహుమతుల ప్రధానం




విజేతల బహుమతులను అందజేస్తున్న కోచ్‌లు దీప్తి రెడ్డి, గురు సాయి దత్త, ఉపాధ్యక్షులు ఆనంద్ బాబు,ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తదితరులు

**మలక్ పేట ,జూన్ 9, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2025 టోర్నమెంట్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిధి గా అంతర్జాతీయ మాజీ క్రీడాకారిణి, గోపీచంద్ అకాడమీ కోచ్ శ్రీమతి దీప్తిరెడ్డి, అంతర్జాతీయ మాజీ క్రీడాకారుడు అంతర్జాతీయ కోచ్ శ్రీ గురు సాయి దత్త , రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పి. ఆనంద్ బాబు, కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తదితరులు విచ్చేసి టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి బి. సాయిరెడ్డి, సామ ప్రభాకర్ రెడ్డీ, సంయుక్త కార్యదర్శి యువిఎన్ బాబు, మీడియా ఇంచార్జి రమణా రెడ్డీ తదితరులతో పాటు సుమారు 1000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

### అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్‌కు ఎమ్మెల్యే వినతి



**నేరెడ్ మెట్, జూన్ 9,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్. వి కర్ణన్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఉన్న గౌతమ్ నగర్ డివిజన్, మల్కాజ్గిరి, మోలాలి, నేరేడ్మెట్, ఈస్ట్ ఆనంద్ బాగ్, వినాయక్ నగర్, వెంకటాపురం, ఆల్వాల్, మచ్చ బొల్లారం డివిజన్ లలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహిళా సునీత రాము యాదవ్, మల్కాజ్గిరి డివిజన్ మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, దోలి రమేష్, నరేందర్, జేపీసీ వెంకన్న, మేకల రాము యాదవ్, బైరు అనిల్,సిద్ధి రాములు, కిట్టు, కృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్,ఉన్నారు.

## మీ ఆస్తులను ఎవరూ తీసుకెళ్లలేరు ..నిశ్చింతంగా ఉండండి

-రిజిస్ట్రేషన్ల నిలిపివేతపై ఆర్డీవోతో మాట్లాడిన మధుయాష్కీ గౌడ్

-వెంటనే తగిన ఆర్డర్‌ను విడుదల చేస్తామని పేర్కొన్న ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీ గౌడ్.

**వనస్థలిపురం. మే.9.ప్రభాతవార్త.**

హయత్ నగర్ డివిజన్ కమలానగర్, ఆంధ్ర కేసరి నగర్ కాలనీలలో రిజిస్ట్రేషన్ లపై స్టేటస్ కో విధించిన సమస్యను పరిష్కరిస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. ఆయా కాలనీల అసోసియేషన్ల ఆహ్వానం మేరకు సోమవారం మధుయాష్కీ కమలానగర్లో పర్యటించారు. ఆ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... 40 ఏళ్ల కిందట చేసిన లేఅవుట్లను తమ ఇనాం భూములు అని పేర్కొంటూ.. కొంతమంది కోర్టుకు వెళ్లి, ఇప్పుడు తమవంటే చెల్లదన్నారు.కాలనీవాసుల ముందే ఆర్డీవో తో మాట్లాడిన మధు యాష్కీ . ఏ ప్రాతిపదికన రిజిస్ట్రేషన్ లపై స్టే విధిస్తారని ప్రశ్నించారు. తను కూడా న్యాయవాదినని, హైకోర్టు నుంచి నిర్దిష్టమైన ఆదేశాలు లేకుండా ఏ విధంగా రిజిస్ట్రేషన్ లపై స్టేటస్ కో ఇస్తారు అని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ లపై విధించిన స్టేను వెంటనే ఎత్తివేసేలా ఆర్డర్ ను రూపొందించి విడుదల చేయాలని సూచించారు. దీంతో స్పందించిన ఆర్డీవో త్వరలోనే తగిన ఆర్డర్ ను విడుదల చేస్తామన్నారు. కొంతమంది నాయకులు తెర వెనక ఉండి .. ఇలాంటి రిజిస్ట్రేషన్లు నిలిపివేత చర్యలు చేపడతారని బ్లాక్ మెయిల్, బెదిరింపులతో వసుళ్ల దందాకు తెర లేపారని అన్నారు. ఆ నాయకులు, వాళ్లే స్టేటస్ కో ఇప్పించి..వారి చుట్టూ తిప్పించుకుంటారని పేర్కొన్నారు. అలాంటి వారి చర్యలు సాగవని, అధికారులు ఎవరైనా స్టేటస్ కో అంటూ చట్ట విరుద్ధంగా వ్యవహరించాలని చూస్తే.. వారి స్టేటస్ తొలగించేలా చేస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పలు సమస్యలను వివరిస్తూ పరిష్కరించాలని వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి గారు, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి గారు, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్, కమలానగర్ కాలనీ అధ్యక్షులు టీవీ రావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ప్రతినిధి దివాకర్, న్యాయవాది వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, సత్యనారాయణ, పట్లోళ్ల మాధవరెడ్డి, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాల మంచి వేదిక

**- ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ**



మలక్ పేట్‌లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మలక్ పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ, తదితరులు

**మలక్ పేట జూన్ 9, ప్రభాతవార్త:**

పిల్లల బంగారు భవిష్యత్తుకు మలక్ పేట ప్రభుత్వ పాఠశాల మంచి వేదికగా నిలుస్తుందని మలక్ పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు. మలక్ పేట పరిసర ప్రాంతాలలో ఆమె పర్యటించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించారని కోరుతూ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలక్ పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసర ప్రాంతాలలో పర్యటించి పిల్లల తల్లిదండ్రులతో సమావేశమై మలక్ పేట ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సదుపాయాల గురించి , విద్యా బోధన, ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం సదుపాయం, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, డిజిటల్ బోర్డు ద్వారా విద్య బోధన, అర్హులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, విద్యార్థుల ఆరోగ్యం పై నిరంతర పర్యవేక్షణ తదితర అంశాల గురించి వివరించడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా ప్రతి మూడవ శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం అవడంతో పాటు విద్యార్థులకు సంగీతము, నృత్యము, యోగ, కరాటే తదితర వాటిలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. అంకితభావం గల నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిల్కానగర్ డివిజన్‌ను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం : కార్పొరేటర్ బన్నాల

**నాచారం, జూన్ 9 ప్రభాతవార్త :** చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ మెంబర్, బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ న్యూ రాంనగర్ కాలనీలో సుమారు రూ. 12 లక్షల వ్యయంతో నిర్వహిస్తున్న సిసి రోడ్డు పనులను జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు డీఈ.వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు.అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ సిసి రోడ్డు నిర్మాణ సమయంలో నాణ్యత తప్పక పాటించే విధంగా అధికారులు అనునిత్యం పర్యవేక్షించాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్వరతగతిన రోడ్డు నిర్మాణం పనులు చేపట్టే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డివిజన్‌కు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి నిధుల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు సమకూర్చే విషయంలో చిల్కానగర్ డివిజన్ కు పెద్ద పీటం వేస్తున్నందుకు వారికి కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. సిసి రోడ్డు వేయిస్తానని చెప్పి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కార్పొరేటర్ కి న్యూ రామ్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు డీఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్ ,టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాణాల నారాయణరెడ్డి, కోకొండ జగన్, శ్యామ్, న్యూ రాంనగర్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బలరాం, ప్రధాన కార్యదర్శి నవీన్, సిద్దయ్య ప్రభాకర్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్

## మీర్‌పేట్ మాజీ ఎంపిటిసి తీగల రంజిత్‌రెడ్డి మృతి

-తీవ్ర అనారోగ్యంతో కిమ్స్ ఆసుపత్రిలో కన్నుమూత

-మీర్‌పేట్, సలీంనగర్‌లలో విషాదఛాయలు

-గురువారం స్వగ్రామంలో అంత్యక్రియలు

**సరూర్‌నగర్, జూన్ 9 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని మీర్‌పేట్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, పూర్వ సరూర్‌నగర్ మండల పరిషత్‌లో రెండు సార్లు ఎంపిటిసిగా పని చేసిన తీగల రంజిత్‌రెడ్డి మృతి చెందారు. గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఆయన సికింద్రాబాద్ మినిస్టర్స్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం కన్నుమూశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ పాత గ్రామ పంచాయతీ పరిధిలో అదే విధంగా మలక్‌పేట్ నియోజకవర్గంలోని మూసారంబాగ్ డివిజన్‌లో మంచి పట్టు ఉండి బలమైన నేతగా ఉన్న రంజిత్‌రెడ్డి మృతితో ఆయా ప్రాంతాల్లో విషాద ఛాయలు ఛాయలు అలముకున్నాయి. 2006లో మీర్‌పేట్ ఎంపిటిసిగా, ఆ తర్వాత 2014లో మరో సారి ఎంపిటిసిగా ఎన్నికైన రంజిత్‌రెడ్డికి మీర్‌పేట్ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన పేరుంది. అంతే కాకుండా ఆయన నగరంలోని మూసారం బాగ్ డివిజన్‌లో తన సోదరుడు అజిత్‌రెడ్డి సతీమణి తీగల సునరితరెడ్డిని కూడా అప్పట్లో కార్పొరేటర్‌గా గెలిపించుకొని సత్తా చాటారు. అప్పట్లో ఉమ్మడి మలక్‌పేట్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో ఆ తర్వాత మహేశ్వరం నియోజకవర్గంలో అప్పటి హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి నాయకత్వంలో కీలక నేతగా పని చేసిన రంజిత్‌రెడ్డి అటు నగరంలోని మూసారంబాగ్‌లో ఇటు స్వగ్రామం మీర్‌పేట్ గ్రామీణ–పట్టణ ప్రాంతంలో బలమైన నేతగా పేరుపొందారు. అయితే గత రెండు, మూడేళ్ళ క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన రాజకీయాలకు తప్పనిసరిగా దూరమై చికిత్స తీసుకుంటున్నారు. అయితే ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో చివరకు తుది శ్వాస విడిచారు.

**తీగల సుభాష్‌రెడ్డి కుటుంబంలో విషాదాలు**

మలక్‌పేట్ సలీంనగర్‌లో నివాసం ఉంటున్న మీర్‌పేట్‌కు చెందిన గ్రామ పెద్దలు, భాగ్యనగర్ సొసైటీ మాజీ డైరెక్టర్ తీగల సుభాష్‌రెడ్డి కుటుంబాన్ని విషాదాలు వెంటాడుతున్నాయి. ఆయన చిన్న కుమారుడు తీగల అజిత్‌రెడ్డి కుమారుడు ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన కారు ప్రమాదంలో దుర్మరణం పాలై మూడు, నాలుగు నెలలు కూడా గడవకముందే ఆయన ఏకంగా ఆయన పెద్ద కుమారుడు రంజిత్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం వారి కుటుంబంలో విషాదాలను నింపింది. సుభాష్‌రెడ్డి సైతం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఆదివారం డిశ్చార్జి అయి ఇంటికి వచ్చిన మరునాడే సోమవారం ఉదయం ఆయన పెద్ద కుమారుడు రంజిత్ మృతి చెందడం గమనార్హం. రంజిత్‌రెడ్డి కుమార్తె అమెరికాలో చదువు నిమిత్తం వెళ్ళిన నేపథ్యంలో ఆమె వచ్చిన తర్వాత గురువారం ఆయన అంత్యక్రియలు స్వగ్రామం మీర్‌పేట్‌లో జరుగుతాయని తీగల కుటుంబీకులు తెలిపారు.

## బాలాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు




బాలాపూర్ రెవెన్యూ సదస్సులో వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**సరూర్‌నగర్, జూన్ 9 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బాలాపూర్ గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. మండల డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో మొత్తం 15 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నెంబర్లు తీసేసి కొత్త పాస్‌బుక్‌లు ఇవ్వాలనీ అదే విధంగా భూభారతికి సంబంధించి తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం పలువురు దరఖాస్తులు ఇచ్చారు.

**పట్టాలున్న దళితులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ వినతి**

కాగా ఈ సదస్సులో ఎఆర్‌సిఎల్‌లో భూములు కోల్పోయి ఇందిరమ్మ పట్టాలు ఉన్న బాలాపూర్ గ్రామ సర్వే నెంబర్ 74కు సంబంధించిన దళిత రైతులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు నాయకులు బొర్ర రవి మాదిగ, మస్కూరి సుధాకర్ మాదిగలు డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డిని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. స్థానిక దళిత రైతులకు జరిగిన అన్యాయాన్ని వివరించిన వారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా బాధితుల విషయాన్ని ఇందిరమ్మ రాజ్యమని పదే పదే చెప్పే గ్రామ నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు అధికారులైనా స్పందించి దళిత రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

## కుర్మల్‌గూడలో రెవెన్యూ సదస్సు



ఎమ్మార్వో ఇందిరాదేవికి దరఖాస్తు ఇస్తున్న రైతు

**సరూర్‌నగర్, జూన్ 9 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని కుర్మల్‌గూడలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. మండల తహసీల్దార్ ఇందిరా దేవి ఆధ్వర్యంలో స్థానిక పాత గ్రామ పంచాయతీ/కార్పొరేషన్ వార్డు ఆఫీస్‌లో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి మూడు దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

## కోదండరాంనగర్‌లో సిసి రోడ్డు నిర్మాణం



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ కోదండరాం నగర్‌లో రూ.8.50లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి సోమవారంనప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. కాగా తమ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణం పట్ల కోదండరాంనగర్ వాసులు హర్షంవ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ఇంజనీరింగ్ ఎఇ శిరీష, కాలనీవాసులు జంగారెడ్డి, సురేష్, రంగారావు, వెంకటేష్, పాండు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బి బ్లాక్స్ తరలించాలి -కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ గాంధీ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బి బ్లాక్స్‌లోని 56, 57 క్వార్టర్స్‌ను కేటాయించాలని కోరుతూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి హైద్రాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి లో సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. పేదలు నివసించే గాంధీనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సరైన భవనం లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారని, గదుల కొరత మూలంగా కొత్తగా విద్యార్థులను పాఠశాలలో చేర్చుకోలేక పోతున్నారని, ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న బి బ్లాక్స్‌లోని క్వార్టర్స్‌ను పాఠశాలకు కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు కార్పొరేటర్ అరుణ తెలిపారు.కార్యక్రమంలో రాజారాం, దిలీప్, చందర్ పాల్గొన్నారు.

### సరూర్‌నగర్ చెరువులో చెత్త వేయవద్దు : కార్పొరేటర్



అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ చెరువును శుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సరూర్‌నగర్, ఎల్‌బినగర్ జోన్లకు సంబంధించిన ఎంటమాలజి సిబ్బందితో మూడు రోజుల పాటు చెరువులోని చెత్త, గుర్రపు డెక్కను తొలగించనున్నట్లు ఆయన తెలిపారు. తపోవన్ కాలనీ, గ్రీన్‌పార్క్ కాలనీ, సింగరేణి కాలనీవాసులు ఎవరు కూడా చెరువు వద్ద, వాకింగ్ ట్రాక్ వద్ద చెత్త వేయవద్దని ఆయన కోరారు. చెరువు వద్ద, చెరువులో చెత్తను వేయడం వల్ల ఈ ప్రాంత వాసులు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. అందరి సహకారం ఉన్నప్పుడే చెరువును శుభ్రంగా ఉంచడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజి ఎస్ఇ మాధవరెడ్డి, సరూర్ నగర్ ఎఇ రాంబాబు, ఎల్‌బినగర్ ఎఇ మని, సిబ్బంది అర్జున్, యాదయ్య, శంకరప్ప, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కంటెస్టడ్ ఎమ్మెల్యే ఆదం విజయ్ కుమార్

**తార్నాక, జూన్ 9 ప్రభాతవార్త :** మున్నూరు కాపు సంఘం లాలాపేట్ కార్యాలయంలో సికింద్రాబాద్ కంటెస్టడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదం విజయ్ కుమార్ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని, బాల్యం నుంచే క్రమశిక్షణతో చదువుకొని సమాజానికి, తల్లి తండ్రులకు, స్కూల్‌కు పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ మున్నూరు కాపు అధ్యక్షులు ఆర్.వీ మహేందర్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం మున్నూరు కాపులు పనిచేస్తున్నారని చెప్పారు. మున్నూరు కాపులు తమ సభ్యత్వాన్ని పెంచుకొని సామాజిక సేవలో ముందుండాలని కోరారు. విద్యార్థులు బాగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు.అనంతరం సంఘం అధ్యక్షులు చిలుక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మీసాల శ్రీనివాస్, కోశాధికారి కొండమడుగు నాగరాజు మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా లాలాపేట్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా వారు ఆదం విజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చిలుకూరి వెంకట్‌రావు, చింతల క్రిష్ణస్వామి, సేవెల్లి వెంకటేష్, గర్షమోహన్, సభ్యులు గుండం చంద్రకుమార్ పాల్గొన్నారు.

### బస్సు డ్రైవర్లు ఉచిత కంటి వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలి - ఆర్టిఓ సుభాష్ చంద్ర రెడ్డి

**తూర్కయంజాల్ జూన్ 9 ,ప్రభాతవార్త :** తూర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగుడ ఆర్టీఓ కార్యాలయంలో బి.యన్.రెడ్డి నగర్ లోని శ్రీ సాయి నేత్రాలయ కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఈ నెల 10 మరియు 11వ తేదీలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టిఓ సుభాష్ చంద్ర రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని స్కూల్ బస్సు డ్రైవర్ లందరూ తప్పకుండా ఉపయోగించుకోవాలని వారు కోరారు.

## అందరికీ ఆదర్శం ఇంద్రసేనారెడ్డి



ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న సుమన్‌గౌడ్, కృష్ణప్రకాష్

**ఎల్.బి.నగర్ జూన్ 9 ప్రభాతవార్త:** క్రమశిక్షణ నియమ నిబద్ధతతో ఉండే త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అందరికీ ఆదర్శం అని రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బత్తుల సుమన్‌గౌడ్, బిజెపి ఎస్సీ మోర్చా నాయకుడు కృష్ణప్రకాష్ పేర్కొన్నారు. గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని చైతన్యపురి డివిజన్ బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో క్రమశిక్షణగా ఉంటూ సామాన్య కార్యకర్త నుంచి గవర్నర్ స్థాయిగా ఇంద్రసేనారెడ్డి ఎదిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీకాంత్, శివ, కమల్, సత్యం, అర్జున్ , రవి, తిరుమల , ఉపేందర్‌లు పాల్గున్నారు.

### రోడ్డు పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన



కాలనీవాసులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్ జూన్ 9 ప్రభాతవార్త:**

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు నిర్మాణం పనులను చేపడుతున్నట్టు కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకుడి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కమర్షియల్ టాక్స్ కాలనీలో రూ .39 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గుంతలుగా ఉన్న ప్రతి రోడ్డును సిసి రోడ్డుగా నిర్మిస్తామన్నారు. రోడ్డు వేసేటప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, లెవెల్స్ సరి చూసుకుంటూ, నీరు నిలబడకుండా పనిచేయాలని సూచించారు. జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు విశ్వేశ్వరరావు, రాములు, రవీందర్, రాజు, సురేందర్, ఊరెళ్ళి రామకృష్ణ, నర్సింగరావు, నాయకోటి ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### శాంతినగర్ పోచమ్మ ఆలయ గర్భగుడి ద్వారానికి పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి దంపతులు

**నాచారం, జూన్ 9 ప్రభాతవార్త :** ఉప్పల్ శాంతినగర్ లోని శ్రీ పోచమ్మ ఆలయ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పనులు తుది దశకు చేరుకున్నాయి.ఆలయ నిర్మాణంలో భాగంగా సోమవారం ఆలయ గర్భగుడి ద్వారానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కన్నయ్య పంతులు, లింగంపల్లి రామకృష్ణ,బకారం లక్ష్మణ్,బోనగిరి దాస్,ఎడ్ల కృష్ణ, కోడికల్ల రఘు,ముక్కు, తిక్క ప్రకాష్,ఎడ్ల చెందర్, సల్ల ప్రభాకర్, తుమ్మల దేవి రెడ్డి, గొళ్ళకొండ రమేష్, అల్వాలా భాస్కర్, అలుగుల అనీల్, జనగామ రామకృష్ణ, నోముల సురేష్, విజయ్ కుమార్ గుప్తా, కుశంగల సతీష్,ఢిల్లీ చంద్ర శేఖర్ రెడ్డి, జీత్తు రెడ్డి, రూతమ్మ, సుశీల, ఇందిరా,నాని, చిన్ని,అనిత,విజయ, రేణుక పాల్గొన్నారు.

### హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**మలక్ పేట ,జూన్ 9, ప్రభాతవార్త:** హత్య చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ బ్రహ్మ మురారి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 7వ తేదీ రాత్రి మలక్ పేట జడ్జెస్ కాలనీలో ఓ అమ్మాయి విషయంలో చెలరేగిన ఘర్షణలో చంచల్ గూడ చెందిన మహమ్మద్ ఇర్షాద్ అలీ (25) జడ్జెస్ కాలనీలో నివసించే నిజాముల్ హక్ (22)ను కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం నిందితుడు సంఘటన స్థలం నుంచి పారిపోయాడు. అప్పటినుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని చాదర్ ఘాట్ పోలీసులు డబిల్ పురా రైల్వే స్టేషన్ వద్ద అదుపులో తీసుకున్నారు. అతను నుండి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. ఈ మేరకు ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### చట్టాలను ఉల్లంఘిస్తే సహించేది లేదు : వక్కలంక

**ఎల్.బి.నగర్ జూన్ 9 ప్రభాతవార్త:** చట్టాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య తెలంగాణ ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం ఆయన కొత్తపేటలో మీడియాతో మాట్లాడుతూ బ్రాహ్మణులను, ఇతర కులాలను, మతాలను కించపరిస్తే ఊరుకోమన్నారు. సినీ నటుడు మంచు మోహన్ బాబు కుటుంబం బ్రాహ్మణ జాతి పై పగబట్టింది అనే బాధ బ్రాహ్మణులలో నెలకొని ఉందన్నారు. గతంలో దేనికైనా రెడీ అనే సినిమాలో బ్రాహ్మణులను కించపరిచే సన్నివేశాలు చిత్రించడమే కాకుండా బ్రాహ్మణులపై భౌతిక దాడులకు పాల్పడిన సంఘటనలు సంబంధిత బ్రాహ్మణులను ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించిన సంఘటనలు జరిగాయని, తాజాగా కన్నప్ప అనే సినిమాలో పిలక, గిలక, అనే రెండు పాత్రలను రూపొందించి చిత్రించి బ్రాహ్మణులను కించపరిచారని, అసలు విషయం ఏమిటంటే మంచు మోహన్ బాబు కుటుంబం చట్టాలను ఉల్లంఘించిందని, కన్నప్ప సినిమాపై కోర్టులో కేసు ఉండగానే ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించడం చట్టాలను ఉల్లంఘించడం కాదా అని ప్రశ్నించారు. వృత్తిపరంగా కులం ఏదైనా కించపరిచే విధంగా సన్నివేశాలను చిత్రీకరించడం ఫ్యాషన్ గా మారిందని, తక్షణమే మోహన్ బాబు కుటుంబం యావత్ మానవజాతికి క్షమాపణ చెప్పి కన్నప్ప సినిమాలో ఉన్న పిలక, గిలక, సన్నివేశాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం న్యాయ పోరాటం చేస్తామన్నారు.



వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సోమవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లో డ్రైనేజీ పూడికలు తీయిస్తున్న కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్